ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

మంగళవారం 12 ఆగస్టు 2025 | 5

కాకినాడలో సినీనటి 7
అనుపమ సందడి

లారీల చోరీ కేసులో 7
నలుగురి అరెస్ట్

చాగంటి వారి 6
వాగ్భూషణం

'ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి' చొరవతో సమస్యలకు మోక్షం

- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'కు స్పందన
- నేడు రాజమహేంద్రవరం 9వ డివిజన్‌లో సభ
- ముఖ్యఅతిథిగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రజల సమస్యలపై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం చక్కటి ఫలితాలను ఇచ్చింది. 'అక్షరమే అండా.. పరిష్కారమే అజెండాగా' అనే నినాదంతో ఈ ఏడాది జనవరి 28వ తేదీ రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో శ్రీవేంకటేశ్వర నగర్‌లోని ఐఎంఏ హాల్‌లో ప్రజల సమక్షంలో సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తోపాటు 9వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ చండీప్రియ, మున్సిపల్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 9వడివిజన్ పరిధిలో నివసించే అనేకమంది సభకు వచ్చి అపరిష్కృతంగా ఉన్న తమ ప్రాంత సమస్యలు ఏకరవుపెట్టారు. ఇవన్నీ విన్న ఎమ్మెల్యే వాసు కొద్దిరోజుల్లో ఇక్కడి సమస్యలన్నీ పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు. అధ్వానంగా ఉన్న పారిశుధ్య సమస్య అప్పటికప్పుడే పరిష్కారమైంది. విద్యుత్ లోవోల్టేజీ సమస్యపరిష్కారం కాగా, వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావస్తోంది. అప్పట్లో కల్వర్టుల పేరుతో నెమ్మదిగా జరుగుతున్న పనులన్నీ పూర్తయ్యాయి. రూ.10 కోట్లతో 32ముఖ్యమైన పనులు పూర్తయ్యాయి. అందులో సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, పార్కులు ఉన్నాయి. వైసీపీ హయాంలో ఆగిపోయిన ఐఎంఏ హాల్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఈనేపథ్యంలో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి వేంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏహాల్‌లో మంగళవారం సాయంత్రం 4గంటలకు సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది.



సామర్లకోట నుంచి పెద్దాపురం వరకు రైతులు చేపట్టిన భారీ ట్రాక్టర్ల ర్యాలీ, (ఇన్‌సెట్‌లో) ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప, పక్కనే డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

ఆట.. అవినీతి మేట!

- ఉమ్మడి జిల్లాలో 'ఆడుదాం ఆంధ్రా'లో అంతా అవినీతే
- క్రీడల నిర్వహణ పేరుతో రూ.2.50కోట్ల వరకు బొక్కేశారు
- క్రీడలు నిర్వహించకుండానే కిట్లు, నిధులకు లెక్కలు రాసేశారు
- విజిలెన్స్ విచారణలో వెలుగులోకి ఆడుదాం ఆంధ్రా అక్రమాలు
- ఉమ్మడి జిల్లాలో 62మండలాల ఎంపీడీవోల నుంచి 70పేజీల చొప్పున నివేదికలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో ఆడుద్రాం ఆంధ్రాలో అంతా అడ్డంగా కలిపి బొక్కేశారు. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన క్రీడల్లో అసలు క్రీడాకారులంటే వైసీపీ చోటామోటా నేతలే పెత్తనం చెలాయించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఖరీదైన కిట్ల దగ్గరనుంచి విజేతల బహుమతుల వరకు అంతా తామే అయి జేబుల్లో వేసుకున్నారు. క్రీడల నిర్వహణ ఖర్చుల కోసం సచివాలయాలు, మండలాలు, నియోజకవర్గాలకు పంపిన రూ.2.50కోట్లను సైతం మింగేశారు. వెరసి క్రీడాకారుల వసతి, రవాణా, భోజన ఖర్చుల పేరుతోను అడ్డగోలుగా నిధులు దిగమింగేశారు. నియోజకవర్గ, జిల్లాస్థాయిలో విజేతలకు బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సిన డబ్బులను సైతం కాజేశారు. వెరసి ఉమ్మడి జిల్లాలో ఆడుదాం ఆంధ్రాలో అంతా అవినీతే చోటుచేసుకుందని విజిలెన్స్ అధికారులు తేల్చారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఉమ్మడి జిల్లాలో 62మండలాల ఎంపీడీవో కార్యాలయాలనుంచి జిల్లా పరిషత్ అధికారులు రప్పించిన నివేదికలను విజిలెన్స్‌కు అందివ్వగా, దీనిద్వారా మరింత లోతుగా విచారణ జరిపి భారీ అక్రమాలు నిర్ధారించారు. వినియోగించిన కిట్లను తిరిగి పాఠశాలలకు పంపాల్సి ఉండగా మాయమైనట్లు తేల్చారు.

అన్నీ అక్రమాలే...

గత వైసీపీ ప్రభుత్వం 2023 డిసెంబరు 15 నుంచి ఫిబ్రవరి 3వరకు ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలను ప్రోత్సహించడానికి ఉమ్మడి జిల్లాలో పలు క్రీడలను నిర్వహించింది. పలు రకాల క్రీడలను గ్రామ,వార్డు సచివాలయాలు, మండల, నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించింది. ఈపోటీల్లో విజేతలకు జిల్లాస్థాయిలోను క్రీడలు నిర్వహించింది. ఈక్రమంలో కోట్లకుకోట్ల నిధులు వెచ్చించింది. ముఖ్యంగా క్రీడా పరికరాలను కోట్లకు కోట్లు వెచ్చించి ప్రభుత్వమే జిల్లాలకు కిట్లు పంపించింది. అయితే వీటిని జాగ్రత్తగా వినియోగించాల్సి ఉండగా స్థానిక వైసీపీ నేతలు వీటన్నింటిని తన్నుకుపోయారు. క్రీడలు పూర్తయిన తర్వాత తిరిగి స్థానిక పాఠశాలలు లేదా ఎంపీడీవో కార్యాలయాలకు అప్పగించాల్సిఉన్నా అదేం చేయలేదు. క్రీడల నిర్వహణకు సచివాల యాలకు రూ.10 వేల చొప్పున, మండలం, నియోజకవర్గానికి రూ.25వేల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. విజేతలు, క్రీడల నిర్వహణ పేరుతో అప్పటి అధికారపార్టీ నేతలు వీటిని కాజేశారు. ఇలా ఆడుదాం ఆంధ్రా పేరుతో అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా రూ.119కోట్లు ఖర్చు చేయగా ఇందులో భారీ అవినీతి చోటుచేసుకుంది. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడంతో ఉమ్మడి జిల్లాలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రెండునెలలుగా ఉమ్మడి జిల్లాలో 62 మండలాల్లో విజిలెన్స్ అధికారులు ఆడుదాం ఆంధ్రా ఖర్చులు, వచ్చిన కిట్లకు సంబంధించిన నివేదికలను జిల్లా పరిషత్ ద్వారా రప్పించారు.మొత్తం 32ప్రశ్నలకు సంబంధించి జాబితా పంపి ఎంపీడీవోలనుంచి నివేదికలను కోరారు. ఒక్కో ఎంపీడీవో కార్యాలయం నుంచి దాదాపుగా 70పేజీల చొప్పున నివేదికలు అందగా, వీటన్నింటిని విజిలెన్స్ అధికారులు క్రోడీకరించారు. భారీగా అక్రమాలు జరిగాయన్న అనుమానాలున్న ఎంపీడీవో కార్యాలయాల్లో విజిలెన్స్ అధికారులు స్వయంగా విచారణ జరిపి పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. తద్వారా ఈ క్రీడల నిర్వహణలో అడుగడుగునా అక్రమాలు గుర్తించారు. ముఖ్యంగా అప్పటి సీఎం జగన్ ఫోటోలతో టెన్నికాయిట్ కిట్లు ఉమ్మడి జిల్లాకు 3,500, బేసిక్ క్రికెట్ కిట్లు ఉమెన్, మెన్ స్టేజ్ 1 కిట్లు 5,300, బ్యాడ్మింటన్ రాకెట్లు 8వేలు, స్టేజ్ 1 వాలీబాల్స్ 4,200, ప్రొఫెషనల్ విభాగంలో స్టేజ్2 బ్యాడ్మింటన్ రాకెట్లు 3,300, కబడ్డీ నీ క్యాప్‌లు, కోకో యాంక్లెట్స్ 10,500, టీషర్టులు 2.50లక్షలు ఉమ్మడి జిల్లాకు చేరాయి. వీటిలో చాలాకిట్లు క్రీడలు ముగిసిన తర్వాత ఎంపిక చేసిన స్థానిక పాఠశాలలకు పంపాలని అప్పట్లో ప్రభుత్వం ఆదేశించింది. అందినట్లు ధృవీకరణ పత్రాలు తీసుకోవాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సూచించింది. కానీ ఈ వందలాటి కిట్లేవీ అసలు ఇప్పటికీ పాఠశాలలకు చేరలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించగా అప్పట్లోనే స్థానిక వైసీపీ నేతలు ఎవరికివారు వీటిని ఇళ్లకు తీసుకుపోయినట్లుగా విజిలెన్స్ గుర్తించింది. అసలు సచివాలయాలు, మండల, నియోజకవర్గస్థాయి క్రీడలకు అసలు క్రీడాకారులు లేకపోయినా ఆటలు ఆడించినట్లు దొంగ నివేదికలు సృష్టించినట్లు తేల్చింది.



జగన్ బొమ్మలతో ఆడుదాం ఆంధ్రా క్రీడా కిట్లు

విజేతలకు పంగనామాలు..

క్రీడల నిర్వహణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1590గ్రామ,వార్డు సచివాలయాలకు ప్రభుత్వం రూ1.59కోట్లు మంజూరు చేసింది. మండలాలు, నియోజకవర్గాలకు రూ.25లక్షల వరకు పంపింది. వీటిని క్రీడల నిర్వహణ, క్రీడాకారుల రవాణా,భోజన,విజేతల ప్రైజ్‌మనీ రూపంలో ఖర్చులకు వాడాలని సూచించింది. ఇవికాకుండా ఇతరత్రా ఖర్చులన్నీ కలిపి ఉమ్మడి జిల్లాకు రూ.2.50కోట్ల వరకు రాగా, వీటికి తొంభైశాతం వరకు ఎక్కడికక్కడ దొంగ ఖర్చులు రాసి నొక్కేసినట్లు విజిలెన్స్ గుర్తించింది. జరగని పోటీలను జరిగినట్లు చూపించి తప్పుడు లెక్కలు రాసి నిధులు దిగమింగేశారని గుర్తించింది. ఈనిధులను అప్పట్లో స్థానిక వైసీపీ ఎమ్మెల్యేల అనుచరులు కొందరు అధికారులు కలిపి దొంగ బిల్లులు చూపి డబ్బులు నొక్కేశారు. ఇలా సచివాలయాలు, మండలాలు, నియోజకవర్గస్థాయికి వచ్చిన లక్షలకు లక్షల నిధులను తప్పుడు లెక్కలతో కాజేశారు. నిబంధనల ప్రకారం నియోజకవర్గ, జిల్లాస్థాయి విజేతలకు నగదు బహుమతులు అందించాల్సి ఉంటే అదేదీ లేకుండా ఉత్త చేతులే చూపించారు. నియోకవర్గ స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచినవారికి, వరుసగా రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలు, జిల్లాస్థాయి తొలి ముగ్గురు విజేతలకు రూ.60వేలు, రూ.30వేలు, రూ.10వేల చొప్పున ఇవ్వాల్సి ఉంటే బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చేయలేదని తేల్చారు. ఇలా క్రీడల పేరుతో భారీగా నొక్కేసినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అనేక ఎంపీడీవో కార్యాలయాల్లో తనిఖీలు పూర్తిచేసిన విజిలెన్స్ సోమవారం జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయంలో సోదాలు చేసి పలు ఫైళ్లు, ఖర్చుల పేరుతో రాసిన బిల్లులను తీసుకువెళ్లింది.

కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో..

రైతు విజయోత్సవ ర్యాలీ

- సామర్లకోట నుంచి 250 ట్రాక్టర్లతో భారీ ప్రదర్శన
- ట్రాక్టర్ నడుపుతూ ఉత్సాహం నింపిన ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పేరిట రాష్ట్రంలో రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడుల సాయం జమ చేసిన కూటమి ప్రభుత్వాన్ని అభినందిస్తూ కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో సామర్లకోటలో సోమవారం ప్రధాన రహదారుల మీదుగా భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. నాడు వైసీపీ హయాంలో రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2021లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో టీడీపీ చేపట్టిన రైతు కోసం తెలుగుదేశం కార్యక్రమాన్ని అడ్డుకున్న సామర్లకోట గాంధీబొమ్మ కూడలిప్రాంతం నుంచే సోమవారం అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీని రైతులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పచ్చ కండువా ధరించి టీడీపీ జెండాలతో అలంకరించిన ట్రాక్టర్‌ను నడుపుతూ ర్యాలీ అగ్రభాగాన పాల్గొన్నారు. ఆ ట్రాక్టర్‌పై డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, తెలుగు రైతు నాయకులు కంటే జగదీష్‌మోహన్(బాబు), పాలకుర్తి శ్రీనుబాబు, రాజా సూరిబాబురాజు, గుమ్మళ్ల రామకృష్ణ కూర్చొని రైతులను ఉత్సాహ పరిచారు. సామర్లకోట, పెద్దాపురం మండలాలు, పట్టణాల నుంచి 250ట్రాక్టర్లతో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సామర్లకోట రైతు భవన్‌నుంచి స్టేషన్‌సెంటర్ గడియారం స్తంభం కూడలి మీదుగా మఠంసెంటర్, మెహెర్ కాంప్లెక్స్, ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం మీదుగా భారీర్యాలీగా పెద్దాపురం తరలివెళ్లారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) మాట్లాడుతూ రైతులను అన్నివిధాలా సహాయ సహకారాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని, వ్యవసాయం అంటే పండుగగా నిరూపిస్తుందని వెల్లడించారు. ఈ ర్యాలీలో టీడీపీ నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, తోటకూర శ్రీనివాసు, ముసిరెడ్డి శ్రీరాములు, బలుసు శ్రీనివాసు, పైణ్ణి శ్రీనివాసు, చల్లా బుజ్జి, కుర్రా నారాయణస్వామి, సర్వేశ్వరరావు, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, అందుగుల జార్జి చక్రవర్తి, యార్లగడ్డ బాపినీడు, జి.దొరబాబు, గొలితి సత్యనారాయణ, వల్లూరి దొరబాబు, బచ్చల వెంకటరమణమూర్తి, అడ్డాల వెంకన్నబాబు, పారిశ్రామికవేత్తలు పసల పద్మరాఘవరావు, వైద్యులు డాక్టర్ పసల సత్యానందరావు పాల్గొన్నారు.

మాది రైతు పక్షపాతి ప్రభుత్వం

- ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పెద్దాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ సామర్లకోటనుంచి పెద్దాపురం పట్టణం చేరుకోగా అక్కడ వారిద్దరూ మాట్లాడారు. రైతులు వ్యవసాయ పెట్టుబడికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ పథకంలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. ఖరీఫ్‌లో రైతులకు పెట్టుబడి సాయంకింద అన్నదాత సుఖీభవలో భాగంగా రూ.5వేలు, పీఎం కిసాన్ రూ2వేలతో కలిపి మొత్తం రూ.7వేలు సాయమందించారన్నారు. ఎరువులను రాయితీపై అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు బాలవెంకటరమణ ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాథ్, పెద్దాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతిభకు ప్లేస్‌మెంట్

- వసతిగృహాలకు ర్యాంకింగ్
- ఆరు అంశాల్లో పనితీరు ఆధారంగా కేటాయింపు
- మెరుగైన ఫలితాల సాధనకు సరికొత్త ప్రయత్నం
- పోటీతత్వాన్ని పెంచేలా చర్యలు
- ఈ ఏడాది నుంచే అమలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వసతిగృహాల మధ్య పోటీ పెంచి మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈక్రమంలో వసతి గృహాల పనితీరును బట్టి ర్యాంకులు ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లాలో 33 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 41 బీసీ సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. వీటి నిర్వహణపై ఈ విద్యాసంవత్సరం నుంచి సర్కారు ప్రత్యేక దృష్టిసారించనుంది. ఈ విద్యాసంవత్సరం నుంచి ర్యాంకింగ్ విధానాన్ని అమలు చేసి వచ్చేఏడాది ర్యాంకులు ప్రకటించనుంది.

ఆరు అంశాలకు వందమార్కులు

జిల్లాలోని సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహఅధికారులకు దీనికి సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆరు అంశాలను ప్రస్తావించింది. వీటికి వంద మార్కులు కేటాయించింది. అకడమిక్ పెర్‌ఫార్మెన్స్‌కు 40 మార్కులు(హాస్టల్ విద్యార్థులందరి ప్రగతికి 20 మార్కులు, అద్భుతమైన ఫలితాల సాధనకు మరో 20మార్కులు) ఉంటాయి. విద్యార్థుల హాజరు, రిటెన్షన్‌కు ఐదు మార్కులు చొప్పున పది మార్కులు, మెను అమలుకు పది మార్కులు కేటాయించారు. ఇందులో మెనూ ప్రదర్శనకు రెండు, అమలుకు 8మార్కులు ఉంటాయి. వసతిగృహాల్లో అనుకోని విధంగా ఏవైనా ఘటనలు జరిగి విద్యార్థులు ఇబ్బంది పడితే వాటికి స్పందించడం, ఉన్నతాధికారులకు తక్షణమే సమాచారం ఇవ్వడానికి మరో ఐదు మార్కులు కేటాయించారు. పరిశుభ్రత, పచ్చదనం, శానిటేషన్ నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు మరో ఐదు మార్కులు కేటాయించారు. ఆరో కేటగిరీలో తప్పక నిర్వహించాల్సిన అంశాలుగా పేర్కొంటూ 30మార్కులు కేటాయించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాల నిర్వహణకు నాలుగు, ఆరోగ్య పరీక్షల నిర్వహణకు నాలుగు, పీ4 ప్రోగ్రామ్‌లో భాగంగా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాల నిర్వహణ, వనరుల సమీకరణకు మరో నాలుగు మార్కులు, క్రమశిక్షణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్,విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దినందుకు ఆరు, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, ఇన్నోవేషన్‌కు నాలుగు, హాస్టళ్లపై పత్రికల్లో కథనాలకు అధికారుల వివరణకు రెండు మార్కులు కేటాయించారు. ఆరుఅంశాల్లో వచ్చిన మార్కులనుబట్టి వసతిగృహాలకురాష్ట్ర, జిల్లాస్థాయి ర్యాంకులు ప్రకటించనున్నారు.

జిల్లాలో సాంఘికసంక్షేమ, బీసీ వసతిగృహాల్లో వందలాదిమంది విద్యార్థులు ఉన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ కలిపి 33 హాస్టళ్లు ఉన్నాయి. బీసీ సంక్షేమ వసతిగృహాలు ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ కలిపి 41ఉండగా, వాటిలో 3వేలమంది విద్యార్థులు ఉన్నారు. వీరికి చదవడం, లెక్కలుచేయడం వంటివి నేర్పించేందుకు వలంటీర్లను నియమించాలని నిర్ణయించారు. ఒక్కో ప్రీమెట్రిక్ హాస్టల్‌కు ఒక్కో వలంటీర్‌ను నియమించనున్నారు.వీరికి రూ.5వేల చొప్పున గౌరవవేతనాన్ని చెల్లించనున్నారు.

జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

కాకినాడక్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న రైల్వేస్టేషన్‌ల్లో సోమవారం పోలీసులు విస్తృతతనిఖీలు నిర్వహించారు. అసాంఘిక శక్తులకు, చొరబాటుదారులకు తావులేకుండా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశానుసారం ఈ తనిఖీలను అణువణువు క్షుణ్ణంగా పరిశీలించారు. కాకినాడటౌన్, పోర్టు, సామర్లకోట, అన్నవరం, తుని, పిఠాపురం రైల్వేస్టేషన్‌ల్లో ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోల ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ అనుమానిత ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలించాయి. రైళ్ల రాకపోకల్లో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఆకస్మిక తనిఖీలు దోహదపడతాయని పోలీసులు తెలిపారు.

రేపు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, విశ్వవిద్యాలయాల్లో, కళాశాలలో, పాఠశాలల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఈ నెల 1న నుంచి 31 వరకు నెలరోజులపాటు నషా ముక్త్ భారత్ అభియాన్ చైతన్య కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈప్రతిజ్ఞను ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా చేయించాలన్నారు. చిత్రీకరించిన కార్యక్రమం 5నుంచి 10ఫొటోలు, ఒక షార్ట్ వీడియోను addwegdtkkd@gmail.com మెయిల్‌కు పంపాలన్నారు. ఉద్యోగులు, విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు గోడపత్రిక ఆవిష్కరణ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కోసం ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపైన్ నిర్వహించేందుకు రూపొందించిన గోడపత్రికను కాకినాడ కలెక్టరేట్లో కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపైన్ ప్రధానలక్ష్యం జిల్లాలో హైరిస్క్ ఉన్న మండలాల్లో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్నవారికి ప్రతి ప్రభుత్వాస్పత్రుల్లో మందులు ఉచితంగా ఇస్తున్నామన్నారు. జిల్లాలో కళాశాల్లో, ఉన్నతపాఠశాలలో రెడ్‌రిబ్బన్ల క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, జిల్లావైద్యఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్, ట్రైనీ కలెక్టర్ మనీషా, జిల్లా లెప్రసి ఎయిడ్స్ అధికారి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి: జేసీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఆయన జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రగతిని ప్రతిబింబించే విధంగా వివిధశాఖల శకటాలు, స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు సన్నాహక సమావేశం నిర్వహించాలి

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి గణపతి నవరాత్రులు ప్రారంభం అవుతున్న తరుణంలో జిల్లాస్థాయిలో ప్రభుత్వ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించాలని గణేశ్ ఉత్సవ సమితి జిల్లా కమిటీ కోరింది. ఈమేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను సమితి గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, అధ్యక్షుడు దువ్వూరి సుబ్రహ్మణ్యం, ఆహ్వాన కమిటీ జిల్లా అధ్యక్షులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. త్వరలో కాకినాడ ఆర్డీవో ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవ సమితి సమావేశం జరుగుతుందని కలెక్టర్ బదులిచ్చారు. ఈసందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ ఒక పండుగ వాతావరణంలో హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రలు జరుపుకుంటారన్నారు. సెప్టెంబరు 4 వరకు నవరాత్రలు జరుగుతాయని, 6న నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని కోరుతున్నామన్నారు. పెండెం బాబ్జి, బొలిశెట్టి రామకృష్ణ, సేతు మాధవరావు, ఏడిద కృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కోరిన గణేశ్ ఉత్సవ కమిటీ

జిల్లాలో 16వేల మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు

- నేడు మరో వెయ్యి టన్నుల యూరియా రాక

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16వేల మెట్రిక్‌టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మంగళవారం మరో వెయ్యి మెట్రిక్‌టన్నుల యూరియా రామగుండంనుంచి ద్వారపూడి చేసుకుంటుంది. యూరియాను అక్కడే ఉన్న నిల్వ కేంద్రంలో భద్రపరుస్తారు. తర్వాత బుధవారం జిల్లాలోఉన్న రిటైల్ ఎరువుల దుకాణాలకు, రైతు సేవా కేంద్రాలకు, పీఏసీఎస్‌లకు తరలిస్తారు. ఎరువుల స్టాక్ నిల్వలపై సమాచారాన్ని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ కలెక్టర్ షాన్‌మోహన్‌కు సోమవారం అందజేశారు.జిల్లాలో మొత్తంగా అందుబాటులో ఉన్న ఎరువులు 16వేల మెట్రిక్ టన్నులు కాగా దీనిలో యూరియా 4807 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2020 మెట్రిక్‌టన్నులు, ఎంఓపీ 1116 మెట్రిక్‌టన్నులు, ఎన్‌పీకేఎస్ 6507 మెట్రిక్‌టన్నులు, ఎస్ఎస్‌పీ 1550 మెట్రిక్‌టన్నుల నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వంనుంచి వచ్చే ఎరువుల్లో 50శాతం ప్రైవేటు డీలర్లు, 50శాతం మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వ సంస్థలకు కేటాయించాలనే నిబంధన ఉంది. ఈ ఖరీఫ్‌లో ఎరువులకు కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ వివరించారు.

అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించాలి: కలెక్టర్

- పీజీఆర్ఎస్‌కు 441 అర్జీలు



అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు.ఈనేపథ్యంలో ఆయా శాఖల్లో నమోదైన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. వివిధ అంశాలపై 441 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, డీఆర్‌వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 44 అర్జీలు

కాకినాడక్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పరిష్కారంకాక జిల్లావ్యాప్తంగా 44మంది అర్జీదారులు ఎస్పీ జి.బిందుమాధవ్ సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారుల సమక్షంలోనే పోలీస్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో 19 సివిల్, 10 కుటుంబ తగాదాలు, మరో 15 ఇతర సమస్యలు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.



విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, వినయం, నిజాయితీలపై అవగాహన కల్పించడం, కుటుంబ విలువల ప్రాముఖ్యతను వివరించి వారిని సంస్కారంతో కూడిన విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు విలువల విద్య పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. వీటిని విద్యార్థులకు అందించడమే కాక ప్రతిరోజూ ఒక పీరియడ్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. నో బ్యాగ్ డే రోజున ఇదే అంశంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా సూచనలు ఇచ్చారు.



చాగంటి వారి వాగ్భూషణం

- విద్యార్థులకు నైతిక విలువలు, వినయం, నిజాయితీలపై అవగాహన
- కుటుంబ విలువల ప్రాముఖ్యతను చాటిచెప్పేలా పాఠాలు
- 6 నుంచి 10వ తరగతి వరకు ప్రత్యేకంగా పాఠ్య పుస్తకాలు
- ప్రతిరోజూ ఒక పీరియడ్ కేటాయింపు
- నోబ్యాగ్ డే రోజున విలువలపై కార్యక్రమాలు
- ఇవన్నీ ఎన్‌సీఈఆర్‌టీ దీక్ష యాప్‌లో
- క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పాఠాలు, వీడియోలు అందుబాటులోకి

DIKSHA - for School Education NCERT

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

విద్యా రంగంలో మార్పులకు అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పలు కొత్త అంశాలకు శ్రీకారం చుట్టింది. పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్చింది. విద్యార్థులకు విద్యతో పాటు అన్ని సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు నైతిక, కుటుంబ విలువలు, వినయం, నిజాయితీ తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా 'విలువల విద్య' పేరుతో ఒక పుస్తకాన్ని రూపొందించే బాధ్యతను ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావుకు అప్పగించారు. ఇందుకోసం విద్యార్థులకు సంస్కారవంతమైన విషయాలపై అవగాహన కల్పించే విధంగా కొన్ని పాఠ్యాంశాలు, శతక సాహిత్యంలోని పద్యాలతో పొందుపరిచి 6 నుంచి 10వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలను రూపొందించారు. వీటిని ప్రభుత్వం ముద్రించి ఇప్పటికే పాఠశాలలకు అందజేసింది. ప్రస్తుతం విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు.

ప్రత్యేకంగా పిరియడ్

విలువల విద్య పుస్తకాలను అందించడమే గాక వీటిని బోధించేందుకు ప్రతిరోజూ ఒక పీరియడ్ కేటాయించారు. ఆ పీరియడ్‌లో ఇందులోని అంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. ప్రతి మూడవ శనివారాన్ని అన్ని పాఠశాలలు నో బ్యాగ్ డే గా పాటించాలన్న ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా విలువల విద్య పుస్తకంలోని అంశాలను కథల రూపంలో విద్యార్థులతో చెప్పించడం, చిన్నచిన్న స్కిట్స్ రూపంలో వాటిని ప్రదర్శించడం, అందులో పద్యాలు చదివించడం వంటి కార్యక్రమాలను నో బ్యాగ్ డే రోజున చేయనున్నారు.

స్కాన్ చేస్తే చాలు

విలువల విద్య కవర్ పేజీ నుంచి ప్రతి పాఠ్యాంశంపై ఒక క్యూఆర్ కోడ్‌ను పొందుపరిచారు. ఈ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్ చేయగానే దీక్ష వెబ్‌సైట్‌కి వెళ్లి ఆ పాఠ్యాంశం మనకు కనిపిస్తుంది. దీక్ష యాప్‌లో అయితే ఆ పాఠ్యాంశాన్ని డౌన్‌లోడ్ చేయడంతో పాటు అందుకు సంబంధించిన వీడియోలు ఉంటే ప్లే చేసుకోవచ్చు. ఇందునిమిత్తం ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన దీక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో టీవీలు అందుబాటులో ఉన్నందున పాఠాలను వీడియోల రూపంలో ప్రదర్శించేందుకు ప్రయత్నించాలని సూచనలు జారీ అయ్యాయి.



విలువల విద్యలో అంశాల ద్వారా విద్యార్థుల్లో మంచి మార్పు వచ్చి సంస్కారంతో కూడిన విద్యావంతులుగా తయారు కావాలనే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం వీటిని అందుబాటులోకి తేవడం మంచి పరిణామమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



చిన్న మాట- ప్రతిజ్ఞ

6 నుంచి 10వ తరగతి వరకు గల విలువల విద్య పుస్తకాల కవర్ పేజీ లోపలి భాగంలో ప్రభుత్వ గౌరవ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు చిన్న మాట ఉంది. 'విద్య అమూల్య ధనము... విద్యావంతులు గొప్ప అధికార స్థానాలను పొందుతారు... తద్వారా సమాజ హితానికి ప్రయత్నించడం సులభం' అని ఆయన చెప్పారు. విద్య సంస్కారాన్ని అందిస్తోందని, నైతిక విలువలు, వినయం, నిజాయితీ, కుటుంబ విలువలు తెలియకుంటే విద్యార్థులు విద్యావంతులు కాగలరు కానీ సంస్కారవంతులు అగుట కష్టమని అందులో వివరించారు. ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకు సీఎం చంద్రబాబు సూచన మేరకు ఈ పుస్తకాలను రూపొందించినట్టు తెలిపారు. కవర్ చివరి పేజీ లోపల ప్రతిజ్ఞ పేరుతో దేశాన్ని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు అందరినీ గౌరవిస్తానని విద్యార్థులతో చేయించాల్సిన అంశాలు ఉన్నాయి.



విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన పెంచేందుకు దోహదం

బి.వెంకట శివప్రసాద్, ఎంఈవో-2, గొల్లప్రోలు



విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు విలువల విద్య పుస్తకాలు దోహదం చేస్తాయి. ప్రతిరోజూ ఒక పిరియడ్‌ను విలువల విద్యకు కేటాయించారు. 6 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. పలు అంశాలను ఉదాహరణలతో వివరించారు. ప్రముఖులు చెప్పిన మాటలు, వారి జీవితంలో ముఖ్య ఘటనలను పొందుపరిచారు. ఈ పుస్తకాల్లో ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు.



6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న 'విలువల విద్య' పాఠ్య పుస్తకాలకు ప్రత్యేకంగా పేర్లు పెట్టారు.

తోరణం (6వ తరగతి): ఇందులో సాయం చేద్దాం, యోగ్యతకే అధికారం, సాటిలేని మేటి, నడత, గుణము, చిన్ననాటి నుంచి పాఠ్యాంశాలు ఉన్నాయి. డొక్కా సీతమ్మ చేసిన నిత్యాన్నదానం గురించి, కష్టపడి పనిచేసే స్వభావం అలవర్చుకోవడం, స్వభావరీత్యా చెడ్డవారైన వ్యక్తులను గౌరవించి సత్కరిస్తే ఏమి జరుగుతుంది, వివిధ రంగాల ప్రముఖుల చిన్ననాటి సంగతులను వివరించారు.

మనోవికాసం (7వ తరగతి): నిషిద్ధం, దృష్టికోణం, సుజనుడు, కుటుంబ విలువలు, దివ్యాంగులకు చేయూత, దృఢ చిత్తం పాఠ్యాంశాలతో పాటు కొందరు ప్రముఖుల జీవిత చరిత్రల్లోని ముఖ్యాంశాలు, వారు చెప్పిన సూక్తులను పొందుపరిచారు.

సూక్తిసుధ (8వ తరగతి): ఓర్పుతో విజయం, అందమైన అలవాటు, సాయానికి సిద్ధం, శిక్షణ, దుర్గుణాలు, గౌరవం పాఠ్యాంశాలు

సద్గుణసారం (9వ తరగతి): కోపం-శాంతం, వాగ్భూషణం, సార్థకత, నాయకత్వం, అభివృద్ధిపథం, తస్మాత్ జాగ్రత్త ఇందులో పాఠ్యాంశాలు

అమృతధార (పదో తరగతి): విద్య-విలువ, సజ్జన సహవాసం, కీర్తి శరీరం, సహజ గుణాలు, నిందచెందకు, మాటతూలకు ఇందులోని పాఠ్యాంశాలు ఉన్నాయి.



మగ్గంపై నేసిన టస్సార్ పట్టు చీరను ప్రదర్శిస్తున్న గిరిజన మహిళలు

శభాష్

- టస్సార్ పట్టు చీరలు బాగున్నాయి
- గిరిజన మహిళలకు సీఎం చంద్రబాబు ప్రశంస



పైడిగూడెంలో టస్సార్ పట్టు చీరలు తయారు చేస్తున్న గిరిజన మహిళలు

కూనవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని పైడిగూడెంలో గిరిజన మహిళలు తయారు చేస్తున్న టస్సార్ పట్టు చీరలు బాగున్నాయంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడేరు మండలం వంజంగి గ్రామంలో ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో ఈ పట్టు చీరలను ప్రదర్శించారు. పట్టు చీరలను మాత్రమే గిరిజను మహిళలు తయారు చేస్తున్నారని ప్రింటింగ్, డిజైన్ వర్కులను బయట చేయించాల్సి వస్తోందని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రింటింగ్, డిజైన్ వర్కుల్లో కూడా గిరిజన మహిళలకు శిక్షణ ఇవ్వాలని, వాటికి ఎన్ని నిధులైనా కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు తెలిసింది. నాణ్యమైన పట్టుచీరలు కాబట్టి వీటికి డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. గిరిజన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించడంలో శ్రద్ధ చూపిన చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.

ఇదిలా ఉండగా రాష్ట్రంలోనే తొలిసారిగా కూనవరం మండలం పైడిగూడెంలో టస్సార్ పట్టుచీరల తయారీలో గిరిజన మహిళలకు శిక్షణ ఇచ్చారు. అంతకు ముందు ఇక్కడి గిరిజన మహిళలకు పట్టుకాయల నుంచి దారం ఎలా తీయాలో నేర్పారు. అనంతరం శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మగ్గాలపై పట్టుచీరల తయారీలో శిక్షణ ఇచ్చారు. స్థానికంగా అడవుల్లో పండించే పట్టుతోనే ఇక్కడ చీరలు తయారుచేస్తున్నారు. చింతూరు డివిజన్ పరిధిలోని అడవుల్లో సుమారు 4వేల హెక్టార్లల్లో గల మద్ది చెట్లపై గిరిజనులు టస్సార్ పట్టు పురుగుల సాగు చేస్తుంటారు. తద్వారా సుమారు 1,600 మంది రైతులు, వెయ్యి కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. జూన్ నుంచి డిసెంబరు వరకు మూడు దఫాలుగా పట్టు పురుగుల సాగు చేస్తారు. ఒక్కో కుటుంబం రూ.40వేలు వరకు ఆదాయం పొందుతుంది. అధిక దిగుబడి వస్తే రూ.లక్ష కూడా వస్తుంది.



టస్సార్ పట్టు చీరలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (ఫైల్)

క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్

- విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్
- శ్రీప్రకాష్‌లో ముగిసిన అంతర్రాష్ట్ర ఖోఖో పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత విజయప్రకాష్

తునిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):గత మూడు రోజులుగా శ్రీప్రకాష్ విద్యా సంస్థలలో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 తెలుగు రాష్ట్రాల బాలబాలికల క్రీడాపోటీలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు ఉత్సవంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ అంతర్‌రాష్ట్ర ఖోఖో ఛాంపియన్ షిప్ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 180 కిపైగా జట్లు, 2000 మంది క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. మూడు రోజుల నుంచి సుదూర ప్రాంతాల నుంచి గెలుపే లక్ష్యంగా ఆడి గెలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు నిత్యం క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందుతారని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకుడు సీహెచ్ ఎల్ఎం శ్రీనివాస్, సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి. ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ ఎం.అపర్ణ, వివిధ ప్రాంతాలనుంచి హాజరైన విద్యార్థులు, కోచ్‌లు, మేనేజర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాకినాడలో హాకీ టైటిల్ వార్

- ముఖ్య అతిథులుగా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్ రాక

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ కోర్టు వేదికగా జరుగుతున్న 15వ హాకీ ఇండియా జూనియర్ నేషనల్ ఉమెన్ హాకీ ఛాంపియన్షిప్ - 2025 పోటీల క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ ముగించుకుని టైటిల్ వార్‌కి రంగం సిద్ధమయ్యింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మూడోస్థానం కోసం ఉత్తరప్రదేశ్ వర్సెస్ ఛత్తీస్‌ఘడ్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. అనంతరం మూడు గంటలకు టైటిల్ పోరుకు మిగిలిన రెండు జట్లు పోటీపడనున్నాయి. ఈ పోరు ముగిసిన తదనతరం బహుమతి ప్రదానోత్సవానికి కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందుమాధవ్, జేసీ రాహుల్ మీనా, తదితరులు హాజరుకానున్నారు. ఈనెల ఒకటి నుంచి ప్రారంభమైన హాకీ ఛాంపియన్షిప్‌లో 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వచ్చి పాల్గొన్నారు. దీంతో కాకినాడ పరిసర ప్రాంతాలు క్రీడాకారులతో సందడిగా మారాయి.

హాకీకి పెరిగిన ఆదరణ..

కలెక్టర్ షాన్‌మోహన్ ఆధ్వర్యంలో ఆస్ట్రోటర్ఫ్ కోర్టులో జరుగుతున్న హాకీ ఛాంపియన్షిప్‌కి తగిన సౌకర్యాలు కల్పించారు. మన జాతీయ క్రీడా హాకీ కావడంతో స్కూల్, కాలేజ్ విద్యార్థులు సైతం మ్యాచ్‌లను చూసేందుకు తరలిరావడం ఇందుకు నిదర్శనం.

ఇప్పటికే నాలుగు జాతీయ స్థాయి పోటీలు జరగాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయం టోర్నమెంట్లు కూడా నిర్వహించుకునేలా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కలెక్టర్ చొరవచూపడంతో అవకాశాలు మెరుగుపడుతున్నాయి.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు పెద్దాపురం విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో ఈనెల 27 నుంచి 29 వరకు జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకినాడ జిల్లా పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఎంపికయ్యారు. తిరుపతిలో జరిగిన ఎంపికల్లో తెప్పల యోగేష్, సహస్ర, పాశిల లోకేష్ అర్హత సాధించారు. వీరిని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, దుండల పూజిత, సూర్యశ్రీ అభినందించారు.

3.14 లక్షల మంది పిల్లలకు

ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

- జేడీ డాక్టర్ మల్లేశ్వరి



ద్రాక్షారామలో పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న జేడీ డాక్టర్ మల్లేశ్వరి

ద్రాక్షారామ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డా.బి. ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లాలో 314930 మం ది పిల్లలకు ఆగస్టు 12న ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని లక్ష్యంగా పెట్టినట్లు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అమరావతి కార్యాలయ జేడీ డా.ఎస్.మల్లేశ్వరి తెలిపారు. సోమవారం ద్రాక్షారామ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు నమిలిమింగేటట్లు చూడాలన్నారు. జిల్లాలో 1726 అంగన్‌వాడీ కేంద్రాలు, 1582 ప్రభుత్వ పాఠశాలలు, 480 ప్రైవేటు పాఠశాలలు, 53 టెక్నికల్ అండ్ నాన్‌టెక్నికల్ కళాశాలల్లో 314930 మంది పిల్లలకు మాత్రలు మింగిస్తున్నామన్నారు. డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజనం, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు రక్తహీనతను నివారించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు ఆవశ్యకత గురించి తెలిపారు. అనంతరం మండాలమ్మపేట స్కూల్, అంగన్వాడీ సెంటర్లను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో హరి వెంకటేశ్వర్లు, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యులు డా.రత్నసుధ, జి.కమల్‌శేషు, డివిజనల్ సూపర్‌వైజర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీనివాస్, సూపర్‌వైజర్లు జానకమ్మ, వరలక్ష్మీ, శ్రీనివాస్, ఏఎన్ఎం లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫిబా ఆసియా ఉమెన్ కప్ పోటీలకు రిఫరీగా

రామచంద్రపురం క్రీడాకారుడు

- ఈనెల 13నుంచి మలేషియాలో మహిళల బాస్కెట్‌బాల్ పోటీలు



డి.డేవిడ్‌రాజు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మలేషియాలో జరుగనున్న ఫిబా ఆసియా ఉమెన్‌కప్ బాస్కెట్ బాల్ పోటీలకు రామచంద్రపురంనకు చెందిన సీనియర్ క్రీడాకారుడు ధర్నాలకోట డేవిడ్‌రాజు ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 19 వరకు మలేషియాలో ఫిబా ఆసియా ఉమెన్‌కప్ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయి. రామచంద్రపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ క్రీడాకారుడు ధర్నాలకోట డేవిడ్‌రాజు రిఫరీగా ఎంపికైనట్లు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. అంతర్జాతీయ పోటీలకు రిఫరీగా ఎంపికైన ధర్నాలకోట డేవిడ్‌రాజును గన్నమని చక్రవర్తి, డా.స్టాలిన్ అభినందించారు.

టీసీఐఎల్‌తో నన్నయ ఎంవోయూ

- నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



ఎంవోయూ పత్రాలు పరస్పరం మార్చుకుంటున్న అధికారులు

దివాన్‌చెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్(పీఎం ఉష) పథకంలో భాగంగా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసే ల్యాబ్స్, సాంకేతిక సహకారం నిమిత్తం టెలీ కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్ (టీసీఐఎల్)తో ఎంవోయా కుదుర్చుకున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలో సోమవారం వీసీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, టీసీఐఎల్ ప్రతినిధి ఆదిత్య అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేసి పరస్పరం పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఈ ఎంవోయూలో ప్రధానంగా డిజిటల్ కంటెంట్ అభివృద్ధి, వ్యాప్తి చేస్తూ 24 కోర్సులకు ఈ-కంటెంట్‌తో సహా అధిక నాణ్యత డిజిటల్ అభ్యాసన వనరులను రూపొందించడానికి మూక్ లెక్చర్ రికార్డింగ్ స్టూడియో ఏర్పాటు చేయడానికి సహకరిస్తారన్నారు. విశ్వవిద్యాలయంతో బాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులకు నైపుణ్యాలను వృద్ధి చేయడానికి స్వయం, మూక్ వంటి జాతీయ వేదికల ద్వారా డెలివరీని సులభతరం చేయవచ్చునని అన్నారు. అలాగే స్మార్ట్ లెర్నింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేస్తారని అన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఇంటరాక్టివ్ బోర్డులు, కంప్యూటర్ ప్రయోగశాలలు, హైస్పీడ్ వైఫై కనెక్టివిటీతో స్మార్ట్ తరగతి గదులను ఏర్పాటు చేస్తారని చెప్పారు. పాఠ్యాంశాలు, సహపాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మిశ్రమ అభ్యాసం, డిజిటల్ అక్షరాస్యత, కంటెంట్ సృష్టిని ప్రోత్సహిస్తారన్నారు. ఇంకా దీని ద్వారా కలిగే అనేక ప్రయోజనాలను వివరించారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ డిమాండ్‌లను తీర్చడానికి లైఫ్‌సైన్సెస్, జియో సైన్సెస్, ఫుడ్ టెక్నాలజీ, వ్యవసాయశాస్త్రాలతో సహా వివిధ విభాగాల్లో కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ అప్లికేషన్‌లను ఏకీకృతం చేయడానికి వీలవుతుందని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, పీఎం ఉష కోఆర్డినేటర్ కే.రమణేశ్వరి, ప్రాజెక్టు మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఆచార్య కే.శ్రీరమేష్, ఆచార్య డీ.జ్యోతిర్మయి, అధ్యాపకులు వీ.పెర్సిస్, పీ.విజయనిర్మల పాల్గొన్నారు.

దొంగల ముఠా ఆట కట్టు

- నలుగురి అరెస్ట్
- రూ.45 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- సీఐ బృందానికి రూ.50 వేల రివార్డు
- వివరాలు వెల్లడించిన తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు



రాజమహేంద్రవరంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎలాగైనా దోపిడీ చేయడమే వారి లక్ష్యం. గ్యాంగ్‌గా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నారు. వాకిట్లో కల్లాపు వేస్తున్న మహిళల మెడలోని ఆభరణాలు సైతం లాగేస్తారు. అద్దెకు తీసుకున్న కారులో తిరుగుతూ గేటుకు తాళం వేసి ఉన్న ఇళ్లపై పగలు రెక్కీ చేస్తారు. రాత్రి కన్నం వేస్తారు. మంచాలు, టీవీలను కూడా పట్టుకుపోతారు. చోరీ సొత్తును తాకట్టు పెట్టి లేదా అమ్మేసి ఆ డబ్బుతో విలాసాలు చేస్తారు. అలాంటి నలుగురి ఆట కట్టించారు పోలీసులు. రూ.45 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఈ వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే...

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు పంచాయతీ భవానీపురానికి చెందిన గరిమెళ్ల పవన్‌శర్మ కుటుంబంతో గత నెల 15న శ్రీశైలం వెళ్లారు. 20న తిరిగి వచ్చేసరికి ఇంటి గేటు, తలుపు, బీరువా తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. 18 కాసుల బంగారు ఆభరణాలు, 3.50 కిలోల వెండి వస్తువులు దోపిడీకి గురయ్యాయి. శర్మ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. దీనిపై ఎస్పీ నరసింహ కిషోర్ సీరియస్‌గా దృష్టి పెట్టారు. నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో 10మందితో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు 15 రోజులు శ్రమించి చివరికి దొంగతో పాటు గ్యాంగ్‌ని కటకటాల్లోకి నెట్టారు. దర్యాప్తులో కొంతమూరు సంతోష్‌నగర్‌కు చెందిన వేమగిరి హరీశ్ గ్యాంగ్ ఆ దొంగతనం చేసినట్టు గుర్తించారు. దర్యాప్తు ముమ్మరం చేసి కచ్చితమైన సమాచారంతో హరీశ్, అదే ప్రాంతానికి చెందిన మోర్త వెంకటేశ్ (వెంకీ), ఇంద్రపాలెనికి చెందిన తణుకు దుర్గాప్రసాద్(సూర్య), తొర్రేడు టిడ్కో గృహ సముదాయానికి చెందిన బండి ధర్మరాజు(గాబ్రియెల్)ను సీఐ వీరయ్య గౌడ్ బృందం అరెస్టు చేసిందని సోమవారం ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అశోక్, రాజేశ్‌ని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించి చోరీ సొత్తు 301 గ్రాముల బంగారు ఆభరణాలు, 7కిలోల వెండి వస్తువులు, రూ.5 లక్షల నగదు, కారు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, కంచు సామగ్రి, టీవీలు, మంచాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంకా సుమారు 150గ్రాముల బంగారు వస్తువులను రికవరీ చేయాల్సి ఉందన్నారు.

వయసు 34 కేసులు 40..

నిందితుల్లో హరీశ్ వయసు 34 కాగా 40 కేసులు, వెంకటేష్ (36)పై 34, దుర్గాప్రసాద్ (25)పై ఏడు, ధర్మరాజు(29)పై ఏడు కేసులు ఉన్నాయన్నారు. వీళ్లకు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. దొంగల ముఠాను చాకచక్యంగా అరెస్టు చేసి భారీగా చోరీ సొత్తును రికవరీ చేసిన సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐలు ప్రియకుమార్, ఏకే సత్యనారాయణ, నాగార్జున, క్రైం సిబ్బంది అమ్మిరాజు, సత్యనారాయణ, కరీం, బీవీ రమణ, సురేశ్, మురళీని ఎస్పీ అభినందించి రూ.50వేల ప్రత్యేక రివార్డును అందజేశారు.

కాకినాడలో సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి

సుబ్బయ్య హోటల్‌లో భోజనం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం సినీనటి అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. పరదా చిత్రం ప్రచారం నిమిత్తం వచ్చిన ఆమె కాకినాడ నగరంలోని సుబ్బయ్య హోటల్‌లో భోజనం చేశారు. దీంతో ఆమెను చూసేందుకు పెద్దసంఖ్యలో అభిమానులు హోటల్‌కి తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా సినీనటి అనుపమ మాట్లాడుతూ సుబ్బయ్య హోటల్ భోజనం అంటే తనకి ఎంతో ఇష్టమని, అందుకే ఇక్కడ భోజనం చేసేందుకు వచ్చానని తెలిపారు.



సుబ్బయ్య హోటల్‌లో భోజనానికి వచ్చిన అనుపమ

స్కీమ్ పేరిట స్కామ్

రూ.1.20 కోట్ల వరకు కట్టించుకుని మోసం

కోటనందూరు పోలీస్ స్టేషన్‌లో మహిళల ఫిర్యాదు



కోటనందూరులో ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

కోటనందూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంగారం, పొదుపు స్కీం పేరుతో మోసం జరిగిన ఘటన కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బొద్దవరం గ్రామంలో జరిగింది. సుమారు రూ.1.20 కోట్ల వరకు బాధితులు నష్టపోయారు. వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, కుమారులు నారాయణరావు, శ్రీనివాస్ కాకినాడ జిల్లా తుని నక్కినవీధిలో శ్రీశ్రీనివాస జ్యూయలర్ షాపు నడుపుతుండేవారు. వారి వద్ద పలువురు బంగారు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుండేవారు. ఈ పరిచయాన్ని అసరాగా చేసుకుని మహిళలను స్కీం వలలోకి లాగారు. బొద్దవరం గ్రామంలోని పలువురు మహిళల నుంచి నెలనెల సొమ్ములు వసూలు చేసేవారు. సుమారు 36 మంది మహిళలు స్కీంలో చేరి నెలనెల సొమ్ములు కడుతుండేవారు. సుమారు 10 ఏళ్ల నుంచి స్కీం వ్యవహారం సాగుతోంది. మొదట కొన్నేళ్లు సాఫీగానే సాగినా తరువాత స్కీమ్ డబ్బులు వసూళ్లకు రాకపోవడంతో ఆరా తీయగా తునిలో జ్యూయలరీ మూసివేసినట్టు తెలిసింది. వారి స్వగ్రామమైన పాయకరావుపేట మండలం సత్యవరంలో ఇంటికి వెళ్లగా చుట్టుపక్కలవారు నెల రోజుల పైగా ఇంటి వద్ద ఉండడంలేదని తెలిపారు. కూలీనాలీ చేసుకుని నెల నెల వాయిదాల రూపంలో సొమ్ములు కట్టేవారమని, ఇప్పుడు అర్ధాంతంగా షాపు మూసివేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సోమవారం కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో మహిళలు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

లారీల చోరీ కేసులో నలుగురి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు నిందితులు
- రూ.54.88 లక్షల విలువైన ఆయిల్‌ప్యాకెట్లు, నూకల నిల్వలు స్వాధీనం
- రెండు లారీలు, ట్రాక్టర్ సీజ్



నిందితుల అరెస్టు చూపుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీలు, ట్రాక్టర్

పిఠాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సంచలనం కలిగించిన ఆయిల్‌ప్యాకెట్లు, నూకల లోడు లారీల చోరీ కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. రెండు లారీలు, ట్రాక్టర్‌తో పాటు చోరీకి గురైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పిఠాపురంలో సోమవారం సాయంత్రం విలేకర్లకు సీఐ జి.శ్రీనివాస్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

పిఠాపురంలోని కుంతీమాధవస్వామి గుడి వద్ద ఈనెల 5న రాత్రి ఉంచిన లారీని రూ.26.83 లక్షల విలువైన ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌ప్యాకెట్లుతో సహా చోరీ చేసినట్టు కాకినాడకు చెందిన దగ్గు అప్పారావు ఈనెల 6న ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా డ్రైవర్స్ కాలనీ వద్ద ఉంచిన నూకల లోడు లారీని గుర్తు తెలియని ఆగంతుకులు దొంగలించినట్టు ఆకుల ప్రసాద్ ఫిర్యాదు చేయగా పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో 2 కేసులను నమోదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ ఏఎస్పీ పర్యవేక్షణలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలు మణికుమార్, జానీభాషా, ఎస్.రామకృష్ణ, వెంకటేష్ ఆధ్వర్యంలో 5 దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ పుటేజీలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ సాగించారు. చేబ్రోలు నుంచి వజ్రకూటం వెళ్లే ఎలబంద పుంతరోడ్డులో యాల ఒక వారి గరువు వద్ద నిందితులు ఉన్నట్టు గుర్తించారు. అనంతరం పిఠాపురం పట్టణం బొజ్జావారితోటకు చెందిన బెల్లంకొండ రవితేజ, కోటగుమ్మం ప్రాంతానికి నాగిరెడ్డి నాగ సతీష్, లయస్క్లబ్ ఏరియాకు చెందిన గంజి సురేష్, పండూరుకు చెందిన శంఖవరం మండలం మండపంలో నివాసముంటున్న నందిపాటి వీరసుబ్రహ్మణ్యంలను అరెస్టు చేశారు. వారి నుంచి చోరీకి గురైన 2 లారీలు, సరుకు రవాణాకు వినియోగించిన ట్రాక్టర్, ట్రక్‌లు, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు బాక్సులు, నూకలతో కూడిన కోళ్లమేత బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.54.88 లక్షలుగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఇద్దరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని, 63సన్‌ఫ్లవర్ ఆయిల్‌బ ండిల్స్ స్వాధీనం చేసుకోవాల్సి ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు. కాగా నిందితుల్లో ప్రధాన వ్యక్తిగా ఉన్న బెల్లంకొండ రవితేజ గతంలో కాకినాడ పోర్టు నుంచి బియ్యం లోడు లారీ చోరీ కేసులో నిందితుడిగా ఉన్నట్టు తెలిపారు.

నిందితులు... జనసేనతో సంబంధాలు!

అరెస్టయిన నిందితుల్లో ముగ్గురు జనసేన పార్టీకి చెందిన వారున్నట్టు చెప్తున్నారు. వీరిలో ఒకరు లారీ యూనియన్ పదవి కోసం ముమ్మరంగా ప్రయత్నాలు సాగించారు. వీరు కొందరు జనసేన కీలక నేతలతో దిగిన ఫోటోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పోలీసులు మాత్రం అధికారికంగా ధృవీకరించడం లేదు.

బైక్ ఢీకొని భార్య మృతి

భర్తకు స్వల్ప గాయాలు



మృతిచెందిన రాఘవ

దివాన్‌చెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారి దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో గండేపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన జనపరెడ్డి రాఘవ(59) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్తకు స్వల్పగాయాలయ్యాయి. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం గోపాలపురానికి చెందిన జనపరెడ్డి సత్యనారాయణ, తన భార్య రాఘవతో కలిసి మోపెడ్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. దివాన్‌చెరువు జీరో జంక్షన్ వద్ద వెనుక నుంచి వచ్చిన బైక్ వేగంగా ఢీకొంది. మోపెడ్‌పై వెనుక కూర్చున్న రాఘవ కిందపోయింది. ఆమె తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందిందని పోలీసులు తెలిపారు. సత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయని, జనపరెడ్డి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆర్.మురళీమోహన్ పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని అక్క మృతి

బయటపడ్డ చెల్లెలు

కడియం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజానగరం మండలం కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన చిక్కిరెడ్డి సరోజిని (28)మృతి చెందింది. వివరాలోకి వెళితే... కొత్త తుంగపాడు గ్రామానికి చెందిన సరోజిని కడియం మేకల దిబ్బప్రాంతంలో ఉంటున్న చెల్లి జగతా బుజ్జి ఇంటికి వచ్చింది. ఆధార్‌కార్డుకు ఫోను నెంబర్ లింక్ చేయించుకునేందుకు ఇద్దరూ బ్యాంక్‌కు బయలుదేరారు. ఇద్దరూ నడిచి వస్తుండగా బుర్రిలంక నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొంది. సరోజికి బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు కడియం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బుజ్జి సురక్షితంగా బయటపడింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్



నిందితులను పట్టుకున్న పోలీసులు

కాట్రేనికోన, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామ శివారులో గంజాయి సేవిస్తున్న వాసంశెట్టి సోమేశ్వర సాయిపవన్, పలివెల కార్తీక్, ముసలి తేజస్వరూప్, మోకా సంతోష్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు. నిందితులను ముమ్మిడివరం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 15 రోజులు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

వాడపల్లి ఆలయానికి రూ.12 లక్షల విలువైన బ్యాటరీ కార్లు

ఆత్రేయపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం జెఎస్ఎన్ రాజు కనస్ట్రక్షన్స్ ద్వారా రూ.12 లక్షల విలువైన బ్యాటరీ కార్లను అందజేశారు. ఈనెల 15న కార్లను ప్రారంభించడం జరుగుతుందని డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. దాతలను అభినందించారు.



ఆలయానికి అందించిన బ్యాటరీ కార్లు

రెండు కార్లు, వ్యాను ఢీ

నలుగురికి స్వల్ప గాయాలు



ధర్మవరం వద్ద ప్రమాదానికి గురైన కారు

ప్రత్తిపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం 16 నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం రెండు కార్లు, ఐసర్ వ్యాను ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురుకి స్వల్ప గాయాలయ్యాయి. ధర్మవరం జడ్పీ హైస్కూల్ హైవే క్రాసింగ్ రోడ్డు వద్ద తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న 2 చిన్న కార్లు నిలిపారు. అదే సమయంలో వాటి వెనుక తుని నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న ఐసర్‌వ్యాన్ ఓ కారును బలంగా ఢీకొనడంతో వెనుక కారు ముందు కారును ఢీకొంది. దీంతో వెనుక కారులో ఉన్న నలుగురుకిరి స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదం వల్ల హైవేపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

నిర్లక్ష్యంగా డ్రైవింగ్.. ఏడుగురు విద్యార్థుల అరెస్టు

అమలాపురం టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా జీపును నడిపి కూల్‌డ్రింక్ షాపులోకి దూసుకెళ్లడమే కాకుండా 2 మోటారు సైకిళ్లను ధ్వంసం చేసిన కేసులో కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన ఏడుగురిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు సోమవారం తెలిపారు. ఈనెల 9న ముక్కామల బైపాస్ రోడ్డులో విద్యార్థులు అతివేగంగా జీపును నడిపి 2 మోటారు సైకిళ్లను ఢీకొట్టి నేరుగా కూల్‌డ్రింక్ షాపులోకి దూసుకుపోయారు. ఈ ఘటనపై స్థానికుల ఫిర్యాదుతో పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు కేసు నమోదు చేశారు. నలుగురు మైనర్లతో పాటు ముగ్గురు మేజర్లయిన విద్యార్థులను అరెస్టు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

జగజ్జీవనరామ్ విగ్రహం పాక్షిక ధ్వంసం

అంబాజీపేట మండలంలో ఘటన

అంబాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి పరిధిలోని కాకరవారిపేటలో బాబూజగ్జీవనరామ్ విగ్రహం పాక్షికంగా ధ్వంసమైనట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ భీమరాజు, ఎస్ఐ చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులతో చర్చించి దర్యాప్తు చేపడతామని తెలిపారు. డాగ్‌స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ సేకరించారు. అనంతరం విగ్రహానికి మరమ్మతులు చేపట్టి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసినట్టు తెలిసింది. అయితే విషయం బయటకు వెళ్లకుండా ఇటు స్థానికులు, అటు పోలీసులు సమాచారాన్ని గోప్యంగా ఉంచారు.

25 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం లారీతో అధికారులు

రాజానగరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీని విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల నుంచి కాకినాడ పోర్టుకు రవాణా చేస్తుండగా విజిలెన్స్, పౌర సరఫరాలశాఖ అధికారులు సోమవారం నిర్వహించిన తనిఖీల్లో పాలచర్లలో 25 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుబడినట్టు రాజానగరం మండల సివిల్ సప్లై అధికారి గొలుగూరి బాపిరాజు చెప్పారు. ఈ మేరకు 6ఏ కేసు నమోదు చేశామని, రికార్డు పరిశీలన నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, పౌర సరఫరాలు వారికి నివేదిక సమర్పించనున్నట్టు చెప్పారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.11, 50,000 కాగా, లారీ విలువ రూ.10 లక్షలుగా అంచనా వేశామని, కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ వంట పాటి సురేంద్రను విచారించామన్నారు. తనిఖీల్లో రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ తహశీల్దార్, సహాయ పౌరసరఫరాల అధికారి తదితరులు ఉన్నారు.

బియ్యం బస్తాల చోరీకి యత్నం

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కాటకూటేశ్వరంలోని గోడౌన్ల వద్ద ఆదివారం రాత్రి 100 కిలోల ఉండే 2 బియ్యం బస్తాలను వాచ్‌మెన్ దొంగిలించుకుపోతుండగా పట్టుకున్నారు. సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిపై మూకదాడి

వృద్ధుడి పరిస్థితి విషమం

అమలాపురం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఇంటిపై ఖాళీ బీరు బాటిల్ విసిరాడన్న నెపంతో యువకుడి ఇంటిపై మూక దాడి చేశారు. యువకుడికి అడ్డుగా వెళ్లిన వృద్ధుడికి తలపై బలమైన గాయమై పరిస్థితి విషమంగా ఉంది. అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సోమవారం విలేకర్లకు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బండారులంక శివారు అరటి మామిడితోట ప్రాంతానికి చెందిన యువకుడైన ఇళ్ల సత్యగోపాల్, వాసంశెట్టి లక్ష్మి కుటుంబాల మధ్య కొంతకాలం క్రితం వివాదరం నెలకొంది. లక్ష్మి ఇంటిపైకి సత్యగోపాల్ బీరు బాటిల్ విసిరాడన్న నెపంతో ఆమె బంధు వర్గీయులు మూకదాడికి దిగారు. పక్కపక్కనే ఇళ్లు కావడంతో సత్యగోపాల్‌పై లక్ష్మి వర్గీయులు మూకదాడి చేయడంతో ఆ సమయంలో తాత గుత్తుల బాబూరావు (65) అడ్డుగా వెళ్లాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆదివారం రాత్రి తొలుత ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం ఉన్నత వైద్యం కోసం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సత్యగోపాల్, బాబూరావు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సత్యగోపాల్ ఫిర్యాదు మేరకు మూకదాడికి పాల్పడిన గొవ్వాల సతీష్, దొమ్మేటి మహేష్, గొవ్వాల నాగేంద్ర, గొవ్వాల నరేంద్ర, గొవ్వాల చైతన్య, గొవ్వాల అరుణ్, గొవ్వాల వెంకన్న, గొవ్వాల సత్తిబాబు, గొవ్వాల ఏసుబాబు, దొమ్మేటి షణ్ముఖరావు, వాసంశెట్టి లక్ష్మిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ శేఖర్‌బాబు తెలిపారు. తనపై సత్యగోపాల్, మరికొందరు దాడికి పాల్పడినట్టు లక్ష్మి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు.

మస్కట్ నుంచి స్వగ్రామానికి..

కొత్తపేట మహిళ రాక

కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సిబ్బంది ఏర్పాట్లు



స్వదేశానికి వస్తున్న మరియమ్మ

అమలాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మస్కట్‌లో చిత్రహింసలు పడుతున్న తన భార్యను స్వదేశానికి తీసుకురావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన సాకా చంటి కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌లో ఫిర్యాదు చేయగా అధికారులు తక్షణం స్పందించారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందించి సాకా మరియమ్మను మస్కట్ నుంచి స్వదేశానికి తీసుకురావడం జరిగిందని డీఆర్వో, కేంద్ర నోడల్ అధికారి కొత్త మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాకా చంటి ఇద్దరు పిల్లల చదువుకు ఆర్థిక స్థోమత లేని కారణంగా తన భార్యను విదేశాలకు పంపాలని నిర్ణయించుకున్నాడని తెలిపారు. కోటిపల్లికి చెందిన వ్యక్తి పరిచయమై కొంత సొమ్మును ఇచ్చి నీ భార్యను నేను విదేశాలకు పంపిస్తానని నమ్మబలికి 2 నెలల క్రితం హైదరాబాద్ నుంచి విమానం ఎక్కించారని, మస్కట్ దేశంలో ఒక ఇల్లు తరువాత మరో ఇంట్లోకి పనికి మార్చారని, భోజన వసతులు లేకపోవడంతో శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ సాకా మరియమ్మను పనిచేయించే వారని, ఫోన్ కూడా అందుబాటులో లేకుండా చేశారంటూ భర్త వాపోయాడు. ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా ఆమెను స్వగ్రామానికి తీసుకురావాలన్న కలెక్టర్ ఆదేశంతో కేసీఎం సెంటర్ ద్వారా సిబ్బంది మస్కట్‌కు పంపిన ఏజెంట్‌ను పిలిపించి ఇరుపక్షాలను కూర్చోబెట్టి సంప్రదింపులు జరిపి మరియమ్మను స్వదేశానికితీసుకొచ్చామని డీఆర్వో చెప్పారు.

పంటకాల్వలో వ్యక్తి మృతి



సత్యనారాయణ(ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం పెదగాడవిల్లికి చెందిన కనికల వీర వెంకటసత్యనారాయణ(51) శనివారం సాయంత్రం పంటకాల్వలో తూర మార్చుస్తుండగా ప్రమాదవశాత్తూ మునిగి మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



లభ్యమైన మృతదేహం

నిడదవోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెం వద్ద సుమారు 50 ఏళ్ల మహిళ మృతదేహం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో కొట్టుకొస్తుండగా స్థానికులు గుర్తించి ఒడ్డుకు తీశారు. దీనిపై సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

మామిడికుదురు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదరు గ్రామానికి చెందిన అడ్డాల సూర్యావతి (64) ఈనెల 2న అదృశ్యమైంది. కాగా ఆమె మృతదేహం గోగన్నమఠం గ్రామంలో సోమవారం లభ్యమైంది. ఆమె మనుమడు చేపూరి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

కోటనందూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. కోటనందూరుకు చెందిన పొటనూరి కా వ్యశ్రీ(19) ఈనెల 9న రాత్రి 7.30 గంటలకు ఇంటి నుంచి మెడికల్ షాపునకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో తండ్రి అప్పారావు కోటనందూరు పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమె మొబైల్ వాట్సప్‌ను పరిశీలించగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నంకు చెందిన మాదవ్ గణేష్‌తో వెళ్లినట్టు అనుమానంగా ఉందన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. కావ్యశ్రీ ఆచూకీ తెలిస్తే 8500811 240లో తెలియజేయాలని కోరారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులకు కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు రౌతులపూడి మండలానికి చెందిన కొరప్రోలు చిన్నబ్బాయి, అన్నవరానికి చెందిన నీరెళ్లా శ్రీనివాస్‌లకు వీల్ చైర్లను జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు సోమవారం అందజేశారు. డీఎంహెచ్‌వో నరసింహనాయక్ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



78 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గాంధీనగర్‌లో సోమవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. 78 మీటర్ల జాతీయ జెండాతో భారత్‌మాతాకీ జై, వందేమాతరం, నవ్యా ఆంధ్రప్రదేశ్‌కి జై బోలో నినాదాలతో కాలేజీ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతా భావాలను కలిగి ఉండాలని, ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరవేయాలని సూచించారు. శ్రీఅగస్త్య కళాశాల కరస్పాండెంట్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు, బీజేపీ ఉమ్మడి తూర్పు గోదావరి మాజీ అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. 38, 39, 41 డివిజన్లలో హర్ ఘర్ తిరంగా యాత్ర కొనసాగింది. కూటమి నాయకులు కర్రి సత్యనారాయణ, కుండల సాయికుమార్, ఏడిద కృష్ణ, మాజీ కౌన్సిలర్ గరిమెళ్ల శర్మ, కందాళ రవి, శ్రీఅగస్త్య కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ బాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

థాంక్యూ సీఎం సార్...!

నేతన్న భరోసా అమలుపై చేనేత సంఘీయుల హర్షాతిరేకాలు

నగరంలో భారీ ప్రదర్శన



100 అడుగుల చేనేత చీరతో మెయిన్‌రోడ్డులో ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు, చేనేతలు

కాకినాడ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నందుకు ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పప్పు దుర్గారమేష్, కాకినాడ నగర పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వింజమూరి వెంకట సుబ్బారావు (చినబాబు) ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని మెయిన్‌రోడ్‌లో 'థాంక్యూ సీఎం సార్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా చేనేత మగ్గానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పూజ చేసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం 100 అడుగుల చేనేత చీరపై 'థాంక్యూ సీఎం సార్' నినాదంతో ర్యాలీ జరిపారు.

కార్యక్రమంలో చేనేత సంఘ నాయ కులు పొన్నగంటి సత్యనారాయణ, బడిగంటి దేవి, జగ్గారపు మల్లికార్జున, పసగడుగుల శేషగిరిరావు, నక్కిన విజయలక్ష్మి, గుడిమెట్ల వీర్రాజు, పోతాబత్తుల పవన్‌కుమార్, కొల్లు వెంకటేశ్వరరావు, వల్లభదాసు శివాజీ గణేష్, చిల్లపల్లి గణపతి, పలివెల లక్ష్మి, శీరం లక్ష్మణప్రసాద్, పచారి నాగేశ్వరరావు, పందిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాల హోరు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో ప్రభుత్వ భూములను, చెరువులను ఆక్రమించి భవనాలు కడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ ఏలేశ్వరం నగర పంచాయతీ 20వ వార్డులో సర్వే నెం.92/1లో ఉన్న ప్రభుత్వ భూమిని ఒక వ్యాపారి ఆక్రమించి భవనాలు కడుతుంటే కమిషనరు మౌనంగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ కొండ భూమి పది సెంట్లలో ఒక ప్రైవేటు వ్యక్తి భవనాలు నిర్మిస్తుంటే కమిషనరు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. ఈ వివాదం హైకోర్టులో ఉన్నప్పటికీ నిర్మాణాలు ఎలా చేస్తున్నారని అడిగారు. ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న నరసరాజు ప్రభుత్వ చెరువును ఆక్రమించిన టీడీపీ నాయకులు భవనాలు నిర్మిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవట్లేదో కమిషనరు సమాధానం చెప్పాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ (ఎంఎల్) మహిళా సంఘం జిల్లా నాయకులు గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మి, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి ఆనంద పాల్, నాగులపల్లి అర్జునుడు, సోమల కోసలవల్లి కొండలరావు, బొండు వీరబాబు, కందుల కృపాప్రసాద్, నాగులపల్లి సంకురు, దొమ్మేటి లక్ష్మి, తిరుమల అజ్జమ్మ పాల్గొన్నారు.

తమకు రావాల్సిన సబ్సిడీ విడుదల చేయాలని ఎంఎస్ఎంఈ పథకం ద్వారా వాహనాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వారికి సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ సంఘీభావం పలికారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన ఉషోదయ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. ఈ మేరకు అసోసియేషన్ సభ్యురాలు శకుంతలాదేవి ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. కాకినాడ ఆర్డీవోతో విచారణ చేయించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



ప్రధానిని అభినందిస్తున్న ఎంపీ సతీష్

ప్రధాని మోదీని కలిసిన ఎంపీ సతీష్‌బాబు

సామర్లకోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీని న్యూఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అత్యధిక కాలం ప్రధానిగా చేసినందుకు, దేశ భద్రత పట్ల ఆయన కట్టుబాటు, ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై అభినందించారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం నుంచి మరింత సహాయం అందించమని కోరారు. ఈ మేరకు ఎంపీ క్యాంపు కార్యాలయం సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది.

పీజీఆర్ఎస్ అర్జీలను తక్షణం పరిష్కరించాలి

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కమిషనరు భావన అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఆమె ప్రజల నుంచి వచ్చిన 14 అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. తొలుత నిర్వహించిన డయల్ యువర్ కమిషనరు కార్యక్రమంలో మేనేజరు సీతారాం ఫోనులో ఫిర్యాదులను స్వీకరించారు. అదనపు కమిషనరు కేటీ సుధాకర్, ఎస్ఈ వెంకట్రావు, హెల్త్ ఆఫీసరు డాక్టర్ పృథ్వీ చరణ్, అకౌంటెంట్ రామశాస్త్రి పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి 324 వినతులు స్వీకరించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మునిసిపల్ కమిషనరు నామ కనకారావు, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో కర్రి స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ఆర్చరీ, బాక్సింగ్ పోటీల్లో కాకినాడ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

బాక్సింగ్, ఆర్చరీ పోటీల్లో 14 మంది క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగే బాక్సింగ్, ఆర్చరీ పోటీల్లో పాల్గొనేందుకు నిర్వహించిన పోటీల్లో పట్టణానికి చెందిన 14 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆర్చరీలో జేఆర్ ఆదిత్య, అరుణ్, జె.నాని, జె.ఐశ్వర్య సూర్యదీపిక, బాక్సింగ్‌లో బి.జైదీప్, సీహెచ్ లోహిత్, వి.వెంకటరమణ, పి.కృష్ణతేజ, కె.హరిణి, హర్షిణి, జె.ఐశ్వర్య సూర్యదీపిక, పి.రత్నం, పి.మహాలక్ష్మి ఎంపికయ్యారు. వీరు జోన్-2 పరిధిలో జరిగే పోటీల్లో కాకినాడ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించే పోటీలకు కాకినాడ జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు, కోచ్ పి.లక్ష్మణరావులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం, కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్రకుమార్ తదితరులు అభినందించారు.

'బోట్ క్లబ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బోట్ క్లబ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, చెరువులో నీరు బయటకు వెళ్లే మార్గం నిర్మించాలని కోరుతూ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఎమ్మెల్యే పంతం నానాజీని కోరింది. సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో సభ్యులు ఎమ్మెల్యేను గొడారిగుంటలోని ఆయన నివాసంలో కలుసుకుని వినతిపత్రం అందించారు. ప్రజలకు ఆహ్లాదాన్నందించేలా పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. చెరువు నీరు బయటకు పోయేందుకు అమృత్ పథకంలో నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిమ్ స్థలం వివాదంలో ఉందని, ప్రత్యామ్నాయంగా జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి దాసరి శ్రీధర్, ప్రసాద్ నాయుడు, ఎన్.వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నానాజీకి వినతిపత్రం ఇస్తున్న బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ప్రతినిధులు

'పంచాయతీల పరిధిలోని చెరువులను మత్స్య సహకార సంఘాలకు లీజుకు ఇవ్వాలి'

కాకినాడ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల పరిధిలో గల చెరువులను మత్స్య శాఖకు బదలాయించి తద్వారా మత్స్య సహకార సంఘాలకు లీజుకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం పాలకవర్గ సాధారణ సమావేశం తీర్మానించింది. ఏటిమొగలోని జిల్లా మత్స్యశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. జిల్లా మత్స్య సహకార సంఘం ఎండీ కె.కరుణాకరరావు, రాష్ట్ర ఫిషర్‌మెన్ సొసైటీ కన్వీనర్ అంపోలు సత్యనారాయణ, తూర్పు గోదావరి జిల్లా నెయ్యల కుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు జనా వెంకటరావు, వైస్ చైర్మన్ కొల్లు రాంబాబు పాల్గొన్నారు. తొలుత ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘానికి జిల్లా మత్స్య శాఖ అధికారి కార్యాలయంలో కేటాయించిన చాంబర్‌ను అధ్యక్షుడు ప్రారంభించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు, మత్స్య శాఖ కమిషనర్‌కు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు, ఆప్కాఫ్ జిల్లా మేనేజరు కె.కరుణాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

గొల్లప్రోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని ఎరువుల దుకాణాల్లో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఆగ్రోస్ ఏజెన్సీస్, వాసవి ఆగ్రో ఏజెన్సీస్, మన గ్రోమోర్‌ల్లో తనిఖీలు జరిపారు. వాసవి ఆగ్రో ఏజెన్సీస్‌లో రికార్డులు, నిల్వలకు తేడాలు ఉండడం, ఈ-పోస్ మిషన్, వాస్తవ నిల్వలకు 22 బస్తాలు వ్యత్యాసం రావడం, బిల్లు పుస్తకాల్లో తేదీలు, రైతుల పేర్లు లేకుండా రాసి ఉండడాన్ని గుర్తించారు. సదరు షాపుపై 6(ఎ) కేసు నమోదు చేసినట్టు ఆర్డీవో తెలిపారు. రూ.11వేలు విలువైన స్టాకును సీజ్ చేశారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, పోలీసులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లూరి సూర్యనారాయణ సన్స్ ఎరువుల దుకాణంలో అధికారులు తనిఖీ చేశారు. ఎరువుల లైసెన్స్ గడువు ముగియడంతో అమ్మోనియం సల్ఫేట్ ఎరువును మూడు టన్నులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, మండల వ్యవసాయ అధికారి, ఏఈవో, వీఆర్వోలు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం సాయంత్రం కాకినాడ ఆర్డీవో మల్లిబాబు తనిఖీలు నిర్వహించారు. ఎరువుల విక్రయాలు, నిల్వలు, రికార్డులను పరిశీలించారు. పిఠాపురం మండలం పి.తిమ్మాపురం గణేష్ ట్రేడర్స్ ఎరువుల షాపును సీజ్ చేశారు. ఆర్డీవో, ఇతర అధికారులు తనిఖీలకు వెళ్లగా షాపు నిర్వాహకుడు తాళాలు వేసుకుని వెళ్లిపోవడంతో షాపును సీజ్ చేశామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు స్వాతి తెలిపారు.

మాల మృతవీరులకు నివాళి

పిఠాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో అశువులుబాసిన మాల మృతవీరులు పొణంగి శేషయ్య, గోపతోటి నారాయణలకు పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాలమహానాడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వీరితో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, తాడి అచ్చారావు, బేతాళ పస్కల్‌రాజు, గుబ్బల బెన్నీ క్రిష్టోఫర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఏపీ మాలమహానాడు అధ్యక్షుడు గుబ్బల రాజు, రాష్ట్ర మాల విద్యార్థి సంఘం కన్వీనర్ దడాల సత్తిబాబు, జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు, ఎడ్ల లక్ష్మీపతి, కాల్దారి లచ్చుబాబు, ముంజవరపు కృపానందం పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ వాహనాన్ని మార్కెట్లోకి విడుదల చేస్తున్న కంటిపూడి సర్వారాయుడు

మార్కెట్లోకి 'కియా' ఎలక్ట్రిక్ వాహనం

సర్పవరం జంక్షన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రాయుడుపాలెంలో కంటిపూడి గ్రూప్ కియా షోరూమ్ ఆధ్వర్యంలో కొత్తగా ఏడు సీట్లతో తయారైన ఎలక్ట్రిక్ వాహనాన్ని ఆ గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు సోమవారం లాంచింగ్ చేశారు. ప్రారంభ ధర రూ.18 లక్షలు అని ట్రైనర్ సూర్య తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు చినబాబు, జగన్ వినయ్, కెనరా బ్యాంకు, సుందరం ఫైనాన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

23న 'చలో ఒంగోలు'

కాకినాడ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న 'చలో ఒంగోలు'ను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సోమవారం పీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకులు పప్పు ఆదినారాయణ, సలీం, రాము, శేఖర్‌రావు, సత్యం పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతిజ్ఞ

కాకినాడ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కచేరీపేటలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మేలుకో ఆంధ్రప్రదేశ్-రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో పరిరక్షణ సమితి సభ్యులు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర సహ కన్వీనర్ రమేష్ పట్నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేయగా జిల్లా గౌరవాధ్యక్షుడు అయితాబత్తుల రామేశ్వరరావు అధ్యక్షత వహించారు. జిల్లా స్థాయి కమిటీ సభ్యులుగా భయ్యాకుమార్, కె.నూకరాజు, రవితేజ, ఎ.సూర్యనారాయణ, చొల్లంగి వేణుగోపాల్, సాలార్‌లను నియమించారు. ప్రజా సంఘాల నాయకులు పలివెల వీరబాబు, హలీం, పిల్లి రామారావు పాల్గొన్నారు.



పొగాకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించి అధిక సంతకాలు సేకరించిన విద్యార్థులకు కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం కలెక్టరేట్లో బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో 7, 8, 9 తరగతి విద్యార్థులకు యాంటీ టుబాకో సిగ్నేచర్ క్యాంపైన్ నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలో పొగాకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించి ప్రజలకు అవగాహన కల్పించిన విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశామన్నారు. డీఎంహెచ్‌వో నరసింహనాయక్, ప్రోగ్రాం అధికారి అరుణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మూడు విభాగాల్లో విజేతలతో అతిథులు, నిర్వాహకులు

'శ్రీప్రకాష్'లో ముగిసిన బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

కాకినాడ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్-7 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిసాయి. ముఖ్య అతిథిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, గౌరవ అతిథిగా తూర్పుగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ సంఘ ప్రధాన కార్యదర్శి కె.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను సీబీఎస్ఈ పర్యవేక్షకుడు గణేష్, ప్రధానరిఫరీ శ్రీనివాసరావు, ఉపరిఫరీ వీరభద్రరావు పర్యవేక్షించారు. అండర్-14 బాలుర విభాగంలో మౌంట్ లిటిరా పాఠశాల (గోల్డ్), ఇండస్ యూనివర్సల్ పాఠశాల (సిల్వర్), సిల్వర్‌హోక్స్ పాఠశాల, సీఆర్ రెడ్డి పాఠశాల (బ్రాంజ్) మెడల్స్ సాధించాయి. అండర్-17 బాలుర విభాగంలో గాడియం పాఠశాల (గోల్డ్), ఆనందపురం పాఠశాల (సిల్వర్), పల్లవి మోడల్ స్కూల్, సెయింట్ జోసఫ్ పాఠశాల (బ్రాంజ్) పతకాలు గెలుపొందాయి. అండర్-19 విభాగంలో సిల్వర్‌హోక్స్ పాఠశాల (గోల్డ్), వికాస్ కాన్సెప్ట్‌స్కూల్ (సిల్వర్), నీలకంఠ విద్యాపీఠ్ పాఠశాల (బ్రాంజ్) పతకాలు సాధించాయి.

విజేతలకు పతకాలు, ట్రోఫీలు, ప్రతిభా పత్రాలను అతిథులు అందజేశారు. విజేతలు సీబీఎస్ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ తెలిపారు.

'వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'



గీత కార్మికులతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

కరప, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని యండమూరులో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గీత కార్మికులకు 10శాతం మద్యం దుకాణాలు కేటాయించినందుకు కృతజ్ఞతగా వారితో కలిసి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ పలివెల జానకిరామయ్య, సూరంపూడి రాంబాబు, గంజా దుర్గాప్రసాద్, కొండా వినాయక్ పాల్గొన్నారు.

వారంలో విద్యుత్ సమస్యల పరిష్కారం: ఈఈ ప్రభాకర్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులో నెలకొన్న విద్యుత్ సమస్యలను వారంలో పరిష్కరిస్తామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఇష్టారాజ్యంగా విధిస్తున్న కరెంటు కోతలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై ఆగ్రహంతో చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జనసేన నాయకులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించిన నేపథ్యంలో ఆయన సోమవారం గ్రామంలో పర్యటించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అందోళనకారులతో చర్చించిన అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్షణం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అవసరమైన లైన్లు మార్పు చేస్తామన్నారు. ఈ నెల 18న మరోమారు సమావేశం నిర్వహించి గ్రామానికి అదనంగా అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. అప్పట్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాల నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో గొల్లప్రోలు ఏఈ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలంటూ

ఇంద్రపాలెం పంచాయతీ కార్మికుల ధర్నా

కాకినాడ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా పెండింగులో ఉన్న జీతాలు చెల్లించాలంటూ ఇంద్రపాలెం పంచాయతీ కార్మికులు సోమవారం ధర్నా చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రేడ్-1 పంచాయతీగా ఉన్న ఇంద్రపాలెం ఆదాయంలో మొదటి ప్రాధాన్యత జీతాలకు ఇవ్వాలని నిబంధనలు చెప్తున్నా పంచాయతీ కార్యదర్శి పాటించట్లేదన్నారు. వీరభద్రం, సత్యనారాయణ, శివరామకృష్ణ, శ్రీనివాస్, రాజు, రాజేష్, సందీప్ పాల్గొన్నారు.

'నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలి'

పిఠాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణకు అందరూ మాత్రలు వేసుకోవాలని నేషనల్ డీ వార్మింగ్ డే ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ సూచించారు. 12న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేసిన ఏర్పాట్లను ఆయన సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ వి.కేశవరావు, మంగాయమ్మరావుపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వినయ్ ఉన్నారు.



సూరంపేట వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి కింద భాగంలో చేరిన నీరు

నీటిలోనే రాకపోకలు

గొల్లప్రోలు సూరంపేట వాసుల ఇక్కట్లు

గొల్లప్రోలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేటకు వెళ్లే మార్గంలో సోమవారం నీరు చేరడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సుద్దగడ్డ (కొండ) కాలువ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండడం, గొల్లప్రోలు రైల్వేస్టేషన్ సమీపంలో మూడో ట్రాక్ నిర్మాణం నిమిత్తం గ్రావెల్ వేస్తూ మార్గాలు మూసివేయడంతో నీరు వెనక్కి వచ్చింది. దీంతో సూరంపేటకు వెళ్లే రైల్వే బ్రిడ్జి అడుగు భాగంలో, రైల్వేట్రాక్ దాటిన తర్వాత సుద్దగడ్డ నీరు నిలిచిపోయింది. ఫలితంగా ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు సూరంపేటకు వెళ్లేందుకు వీలుగా ఊబంద కాలువపై బ్రిడ్జి నిర్మాణం పూర్తైనా అప్రోచ్ నిర్మించకపోవడంతో ప్రజలు ఆ మార్గాన్ని వినియోగించలేకపోతున్నారు. తక్షణం బ్రిడ్జి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీజీఆర్‌ఎస్‌కు రెండు అర్జీలు

గండేపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పింఛను, డ్రైనేజ్ సమస్యలకు సంబంధించి రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. ఎంపీడీవో కె.చంద్రరావు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసు, వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్, ఏపీఎం సన్యాసిరావు, ఏపీవో ఎం.రామకృష్ణరాజు, తదితర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వైభవంగా ముగిసిన అమ్మవారి జాతర


వేలాది భక్తుల సమక్షంలో కొలువుల బండిని సాగనంపుతున్న దృశ్యం

వీఆర్‌పురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) గత ఐదు రోజులుగా వీఆర్‌పురంలో జరుగుతున్న మహాలక్ష్మి అమ్మవారి జాతర సోమవారంతో ముగిసింది. ఐదు రోజులుగా నిష్ట నియమాలతో, మేళతాళాలు, దేవారుల నడుమ సంబరాలతో పూజలు అందుకున్న అమ్మవారు బండిని సాగనంపారు. పూజారులు బండిపై ఏర్పాటుచేసిన పెద్ద గాదెలో (బుట్ట) అమ్మవారికి నైవేద్యంగా ప్రతి ఇంటిలో తయారుచేసిన బియ్యం పిండి రొట్టెలను ఉదయం నుంచే దానిలో వేశారు. గద్దె దగ్గర భక్తులు మొక్కులు తీర్చుకున్న తరువాత బండిపై పూజారిని ఉంచి రెండువైపులా 50 మీటర్ల పొడవు కలిగిన తాడును కట్టి గద్దె దగ్గరి నుంచి దేవారుల సమక్షంలో వేలాదిమంది ప్రజల హర్షధ్వానాల నడుమ బండిని వైభవంగా సాగనంపారు. జాతరను చూసేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 47 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ శుభమ్ నొఖ్వాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు ఏర్పాటు చేయాలని, పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు నిర్మించాలి, వంతెన ఏర్పాటుచేయాలని కోరుతూ సుమారు 47 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, జీసీసీ డీఎం జయశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌గా శుభమ్ నొఖ్వాల్ బాధ్యతల స్వీకరణ


సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శుభమ్ నొఖ్వాల్

రంపచోడవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రంపచోడరం సబ్ కలెక్టర్‌గా శుభమ్ నొఖ్వాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. గిరిజన ప్రాంతంలో రెవెన్యూశాఖకు సంబంధించిన సమస్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు చేపడ తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి అందేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు సరిత, శివ, త్రిమూర్తులు, సీహెచ్ చంటి, డీవైఎస్‌వో శ్రీదేవి, అలెగ్జాండర్, దాసు, విజయశాంతి, అశోక్ సబ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలి

రంపచోడవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పోలవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో సీఎం చంద్రబాబునా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని దండకారణ్య విమోచన సమితి కేంద్ర కమిటీ సభ్యుడు వెదుళ్ల లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల పేరిట 5వ షెడ్యూల్ భూభాగాన్ని నాన్ షెడ్యూల్లో చేర్చే కుట్రపూరిత ఆలోచనను విరమించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వానికి ఆదివాసీలపై చిత్తశుద్ధి ఉంటే రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాలు, చింతూరు డివిజన్‌లోని నాలుగు మండలాలు, పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, ఏలేరుపాడు, కుక్కునూరు, డి.నర్సాపురం మండలాలను పోలవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటుచేయాలన్నారు.

నేడు నులి పురుగుల నివారణ కార్యక్రమం

మోతుగూడెం, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా మోతుగూడెం పరిధిలోని అన్ని పాఠశాలలు, ఆశ్రమ హాస్టళ్ల, అంగనవాడీ కేంద్రాలలో 0-5 సంవత్సరాల పిల్లలకు కృమి నాశక మాత్రలుపై (అల్‌బెండాజోల్) మోతుగూడెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రజ్ఞ విద్యార్థులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలు తప్పకుండా మాత్ర తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మోతుగూడెం పీహెచ్ వైద్య బృందం, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంపచోడవరం వ్యవసాయ సహకార సంస్థ అధ్యక్షుడిగా రాజారెడ్డి



రంపచోడవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ప్రాథమిక వ్యవసాయశాఖ సహకార సంఘం అధ్యక్షుడిగా ముర్ల నరసింహ రాజారెడ్డి, సభ్యులుగా కడబాల గణపతి, బొరగ సోమన్నదొర నియమితులయ్యారు. రాజారెడ్డికి గతంలో గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లో మేనేజర్‌గా పనిచేశారు. నియామకం పట్ల కూటమి నాయకులు హర్షం తెలిపారు.

రహదారి గుంతలో ఇరుక్కున్న టిప్పర్


రహదారిపై గుంతలో దిగబడిపోయిన టిప్పర్

ఎటపాక, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎటపాకలో రహదారులు అధ్వానంగా మారాయి. ఈక్రమంలో సోమవారం ఎటపాక పోలీస్ స్టేషన్ సమీపంలో భద్రాచలం-చర్ల అంతరాష్ట్ర రహదారిపై టిప్పర్ గుంతలో ఇరుక్కుపోయి, వాహనరాకపోకలకు అడ్డంగా మారింది. దాంతో కొన్ని గంటల పాటు ఈ వైపుగా వాహన రాకపోకలు స్తంభించాయి. భద్రాచలం నుంచి చర్ల వైపు మెటల్‌లోడ్‌తో వెళుతున్న టిప్పర్ ఎటపాకవద్ద గుంతలో ఇరుక్కు పోయింది. రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయిన విషయం తెలుసుక్ను టీడీపీ నేత, జేకేసీటీ చైర్మన్ జామాల్‌ఖాన్ జేసీబీ రప్పించి, వెంటనే రహదారిపై అడ్డంగా ఉన్న టిప్పర్‌ను తొలగించారు. గుంతలు పడినచోట అక్కడున్న మట్టితో సదును చేశారు. దీంతో యథావిధిగా వాహనరాకపోకలు సాగాయి.

అక్రమంగా విద్యుత్ కలెక్షన్లు

కూనవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):మండలంలో అక్రమంగా విద్యుత్ కలెక్షన్లు ఇస్తున్నారు. సాధారణంగా విద్యుత్ కలెక్షన్లు ఇవ్వాలంటే పంచాయతీ కార్యాలయం నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి కానీ అటువంటివి ఏమీలేకుండా కొంతమంది అక్రమంగా విద్యుత్ కలెక్షన్ పొందుతున్నారు. ప్రజలనుంచి విమర్శలు వస్తున్నాయి. మరోవైపు పోలవరం పరిహారం పొందిన భూములలో వ్యాపారం చేసుకునేందుకు కొత్తగా విద్యుత్ మీటర్లు ఇవ్వకూడదు. కానీ అటువంటి భూముల్లో విద్యుత్ మీటర్లు అధికారులు ఇస్తున్నారు. కొత్తగా విద్యుత్ స్తంభం తీసుకోవాలంటే రూ.4000 రూపాయలు చలానా కట్టాలి కానీ కొంతమందికి ఉచితంగానే ఇవ్వడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఎటపాకలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఎటపాక, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరిలో దేశభక్తి పెంపొందాలని, దేశ సమైక్యతకు అందరూ పాటుపడాలని బీజేపీ మండలాధ్యక్షుడు నలజాల శ్యామ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకుని సోమవారం ఎటపాకలో విద్యార్థులతో హర్‌ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీ నిర్వహించారు. మూడే సతీష్, దురారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

చదువుల లోగిలి... సుమాల వాకిలి

నందనవనంగా శంఖవరం మెయిన్ పాఠశాల


మొక్కలతో ఆహ్లాదంగా ఉన్న పాఠశాల

శంఖవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తాను చిన్నప్పుడు చదివిన పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయుడిగా చేరిన వెంకటేశ్వరావు మాస్టారు...ఇప్పుడు ఆ పాఠశాల రూపురేఖలనే మార్చేశారు. తాను చదివిన బడిలో పిల్లలు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదవాలని సంకల్పించారు. పిల్లలు ముచ్చట'బడి' రావాలని ఆవరణలో పచ్చని ఏర్పాట్లు చేశారు. కడియం నుంచి రకరకాల పువ్వులు, అలంకణ మొక్కలు తీసుకువచ్చి పాఠశాల ఆవరణను నందనవనంగా మార్చారు. ఇందుకు జీతంనుంచి కొంత నిధులను సమకూర్చారు. ఇదంతా శంఖవరంలోని మెయిన్ పాఠశాల ముచ్చట.

సీతాకోక చిలుకల్లా...

పిల్లలు చదువుతోపాటూ ఆనందంగా ఆడుకునేందుకు ఊయల, ఎగుడుదిగుడు బల్లలు ఇలా హంగులన్నీ దిద్దారు. పాఠశాల ఆవరణనుచూసి గ్రామస్థులు సంబరపడుతున్నారు. ఇలా పూలవనంలో పిల్లలు కోలాహలం సీతాకోకచిలుకల మాదిరి ఉంటుంది. గ్రామస్థులు మాస్టారి కృషిని అభినందిస్తూ ప్రభుత్వ పాఠశాలలు ఇలా ఆహ్లాదకరంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు. మాస్టారి కృషిని మెచ్చుకుంటున్నారు.

కొసమెరుపు...

శంఖవరంలో ఈ పాఠశాలది 125 ఏళ్ల చరిత్ర... ఎన్నో తరాలను తీర్చిదిద్దడమే కాదు అప్పట్లో విప్లవ వీరుడు అల్లూరికి ఆతిథ్యమిచ్చిన ఘనత ఈ పాఠశాలది. భవనాలు, తరాలు మారినా... ప్రైవేటు విద్య చుట్టిముట్టినా ఈపాఠశాల తన ప్రత్యేకతను చాటుతూనే ఉంది. శంఖవరం నుంచి అసెంబ్లీకి వెళ్లిన ఐదుగురిలో నలుగురు ఈ పాఠశాలలోనే విద్యను అభ్యశించారు. రాజకీయాలలో బలమైన ముద్రవేసిన ఈనేలపై ఈవిద్యా సుమం గుభాళిస్తోంది.

ఆనందంగా ఉంది

-కుర్రే వెంకటేశ్వరావు, మాస్టారు



ఈ పాఠశాలలో చదివి ఇదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా రావడం ఆనందంగా ఉంది. నేను చదివిన పాఠశాలను సుందరంగా తయారుచేసి జిల్లాలో ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దాలని సొంత నిధులు వెచ్చించి మొక్కలు వేశాను. ఇప్పుడు అందరూ మెచ్చుకుంటుంటే ఆనందంగా ఉంది. ఇక్కడి పిల్లలను ఉత్తమ ప్రతిభను కనబరిచేలా చర్య లు చేపడుతున్నాం... గ్రామస్థులు, తల్లిదండ్రుల సహకారం ఇందుకు లభిస్తోంది.

పేదలకు అన్నదానం


అన్నా క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల

జగ్గంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరంవద్ద గత నాలుగు సంవత్సరాలుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. జగ్గంపేటకు చెందిన దివంగత నేదూరి శ్రీనివాస్ శాంతి దంపతుల జ్ఞాపకార్థం కుమారులు వీరబాబు, సతీష్ ఆర్థిక సహాయంతో నిర్వహించిన ఈ అన్నాక్యాంటీన్‌కు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై అన్నా క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ సభ్యుడు మారిశెట్టి భద్రం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పేదవారి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, టౌన్ టీడీపీ అధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు, మాదవరపు సూరిబాబు, వేములకొండ జోగారావు, దేగల సత్తి బాబు, చంద్రశేఖర్, రెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలని ధర్నా


ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీ పరధిలో కుమ్మరవీధిలో ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని మాజీ కౌన్సిలర్ బార్ల సత్తిబాబు నేతృత్వంలో మహిళలు సోమవారం ధర్నా చేశారు. స్థానికంగా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీహాలు నిర్మాణానికి ప్రభుత్వం చొరవతీసుకోవాలన్నారు. కమ్యూనిటీ హాలు నిర్మిస్తే 16, 17వార్డులో స్థానికులకు ఉపయోగపడుతుందన్నారు. త్వరలో ఈ విషయంపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, నగర పంచాయతీ కమిషనర్, స్థానిక నాయకులను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. గొర్రెల లక్ష్మి, రమాదేవి, పద్మావతి, భవాని, రామలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

జగ్గంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):స్థానిక రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జిల్లా తెలుగునాడు వైద్యఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ సభ్యులందరూ కలిసి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని కలిసి వైద్యారోగ్య శాఖలోని క్షేత్రస్థాయిలో సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్) వల్ల పడుతున్న ఇబ్బందులు తెలియజేసి దాని నుంచి తప్పించాల్సిందిగా కోరుతున్నా మన్నారు. అలాగే సెకండ్ ఏఎన్‌ఎంలు చాలా కాలం నుంచి జీతాలు పెంచకుండానే పనిచేస్తున్నారు. వాళ్లకి జీతాలు పెంచాలని, ఏఎన్‌ఎంలు, జీఎన్‌ఎంలు శిక్షణ పొంది ఉన్నారు. వాళ్లకు స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పించాల్సిందిగా ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు డు వై.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్, రాజా, ప్రకాష్, వై.శ్రీను, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ప్రత్తిపాడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదురుపాకలో సోమవారం కోదండ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, రెడ్డి అమర్‌నాద్, యర్రాబత్తుల గోవిందనాయుడులు పాల్గొన్నారు. అలాగే ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు కోదండ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీకి రూ.10వేలు ఆలయాభివృద్ధికి విరాళంగా అందించారు.కార్యక్రమంలో సందక నాని, మేకా చంటిబాబు, విత్తనాల నాగేశ్వరరావు, గొల్లపల్లి వీరవేణి, రాజబాబు, గంటా గంగబాబు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, బొల్లునాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, చీడిపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

నాళంవారి సత్రం భూముల కౌలు వేలం పూర్తి

తొండంగి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నాళంవారి సత్రం భూములకు దేవదాయశాఖ అధికార్లు సోమవారం కౌలు వేలంపాటలు నిర్వహించారు. ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో 268 ఎకరాలకు చెందిన 13 బిట్లకు వేలం జరగ్గా 19 లక్షల 68వేల 200 ఆదాయం సమకూరింది. గతంలో 19 లక్షల 11 వేల ఆదాయం సమకూరగా 57 వేల 200 అదనపు ఆదాయం సమకూరింది. పర్యవేక్షకునిగా ఫణికుమార్ హాజరయ్యారు.

రైతులకు పీఏసీఎస్‌లు ఆసరాగా నిలవాలి

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ


ఒమ్మంగిలో పీఏసీఎస్ చైర్మన్ సీతారాంను అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు పీఏసీఎస్‌లు ఆసరాగా, అండగా నిలవాలని ఎమ్మె ల్యే వరుపుల సత్యప్రభ కోరారు. మండలంలోని ఒ మ్మంగిలో సోమవారం సాయంత్రం పీఏసీఎస్ చైర్మన్‌గా సత్యంశెట్టి సీతారాం, సభ్యులుగా కొప్పన శ్రీను, దేవన రామకృష్ణలచే సొసైటీ సీఈవో నిమ్మల గణేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సం దర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పా ల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టాలు, వ్యవసాయ రుణాలు, ఎరువులు వంటివి తెలిసిన రైతు కుటుంబాల వారికి నియోజకవర్గ సొసైటీల పాలకవర్గాల్లో చోటు కల్పించామన్నారు. పీఏసీఎస్‌లు రైతు ల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషిచేసి ఉత్తమ సొ సైటీలుగా గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో చైర్మన్ సత్యంశెట్టి సీతారాం మాట్లాడుతూ ఏలేరు ఎడమ కాలువ నీటిని రైతాంగం పొలాలకు మళ్లించాలని, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల నిర్మాణపనులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ధర్మవరం, లంపకలోవ సొసైటీల చైర్మన్‌లు దాసం శేషారావు, వరుపుల రామకృష్ణ, కూటమి నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, కందా వీరాస్వామి, సుంకర సోమరాజు, బొల్లు కొండబాబు, దాట్ల కృష్ణబాబు, బొల్లువెంకటేశ్వరరావు, ఇళ్ళ అప్పారావు, మంతెన శ్రీను, నాగసూరి, రామకుర్తి కామేష్, సుభాష్, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

జగ్గంపేటలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థలం పరిశీలన


మీడియాతో మాట్లాడుతున్న జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జగ్గంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం రోడ్డులోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, కాపు కల్యాణ మండపం వద్దగల ఖాళీ ప్రదేశాలలో రెండుచోట్ల స్టేడియాల నిర్మాణానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, సాన సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, ఇంజనీరింగ్ అధికారులు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ జగ్గంపేటలో ఇండోర్ స్టేడియంకి మిగిలి ఉన్న పనులకు, పక్కనే ఉన్న స్థలంలో క్రికెట్ స్టేడియం, మరొక స్థలంలో మరో స్టేడియం నిర్మాణానికి సహాయం అందించాల్సిందిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌ని కలిశానన్నారు. ఆయన వెంటనే స్పందించి ఆంధ్రా క్రికెట్ అసోసి యేషన్ సానా సతీష్ ఫౌండేషన్ సహాయంతో చేపట్టిన నిర్మాణాలు సోమవారం ప్ర తినిధులు పరిశీలించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వ ర్యంలో ఈ నిర్మాణం చేపట్టి తొందరలోనే ప్రజలకు అంకితం చేస్తామని నవీన్ తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి సర్వసిద్ధి లక్ష్మణరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు రాయి సాయి, కోడూరి రమేష్, డీఈ ఉమాశంకర్, జేఈ నారాయణరావు పాల్గొన్నారు.

పదవులను బాధ్యతగా నిర్వర్తించాలి

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రామకృష్ణుడు


యనమలను సత్కరిస్తున్న సభ్యులు

తునిరూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):పదవులకు నామినేట్ అయిన నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. గాంధీ సత్రం, రామలింగేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యులు సోమవారం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో యనమలను మర్యాదపూర్వకంగా కలిశారు. తమను నామినేట్ పదవుల్లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుండల రామకృష్ణ, గెడ్డమూరి శివ, నెల్లపూడి బ్రహ్మాజీ, ఆడారి కోటేశ్వరరావు, దంతులూరి వెంకట శివరామకృష్ణ రాజు, తదితరులు పాల్గొన్నారు..

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని ఆందోళన

ప్రత్తిపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని కోరుతూ తాడేపల్లి ఇంటర్మీడియట్ బోర్డు వద్ద కాకినాడజిల్లా కాంట్రాక్ట్ లెక్చలర్లు సోమవారం ధర్నా నిర్వహించారు. పీడీఎస్ ఎమ్మెల్యే గొర్రా గోపీమూర్తి, కాంట్రాక్ట్ లెక్చలర్ల రాష్ట్ర అసోసియేషన్ నాయకులు ప్రత్తిపాడుకు చెందిన గొర్ల మాణిక్యంలు తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ డైరెక్టర్ తాతారావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కాంట్రాక్ట్ లెక్చలర్లు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ లెక్చలర్ల వయస్సు 62కు పెంపుదల చేయాలని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ ఆందోళనలో దయాకర్, కాశీరత్నం, జాన్‌బాబు, శ్యామ్‌కిరణ్, రామకృష్ణ లక్ష్మణ్, కృష్ణమూర్తి, ఓబయ్య, ఖాదవ్‌వలీ, రేవతి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై సమావేశం

జగ్గంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సత్య సాయి బాబా డ్రింకింగ్ వాటర్ కార్మికులు గత 20నెలలుగా జీతాలులేక నిరవధిక సమ్మె చేయడంతో జగ్గంపేట నియోజకవర్గంలోని గోకవరం మండలం, రాజనగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం మండలాలకు తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దృష్టికి రావడంతో సోమవారం జగ్గంపేట రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సీఈవో, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ, డీఈ, జేఈ, కాంట్రాక్టర్, కార్మికులతో కలిసి సమావేశం నిర్వహించారు. కార్మికులకు తక్షణం 50 శాతం జీతాలు చెల్లించాలని వెంటనే విధుల్లోకి తీసుకుని ఈరోజు నుంచి సత్య సాయిబాబా డ్రింకింగ్ వాటర్ ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కాంట్రాక్టర్, సత్యసాయి బాబా డ్రింకింగ్ వాటర్ కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

జగ్గంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జ్యోతుల నెహ్రూ కాలనీ వద్దగల పెన్షనర్ల భవనంలో నెలవారీ సమావేశంలో అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పెన్షనర్స్ వాకర్స్‌కు అకిరా ఆసుపత్రి డాక్టర్స్ కంటి పరీక్ష ఉచితంగా నిర్వహించారు. సమావేశంలో పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు పెన్షనర్ల ఎలక్ట్ గవర్నర్ సూర్యనారాయణ మాట్లాడుతూ మనం కళ్లపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి మంచాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇకపై ప్రతినెలా పెన్షనర్లకు, వాకర్స్‌కు నిపుణులైన డాక్టర్స్ అవగాహన కల్పించేలా ఏర్పాటుచేశామన్నారు. గౌరవాధ్యక్షుడు చంద్రమౌళి వెంకటశాస్త్రి మాట్లాడుతూ మనం కోరిన వెంటనే రాజమండ్రి నుంచి ఇక్కడికి విచ్చేసి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించిన ఆకిర కంటి ఆసుపత్రి యాజమాన్యానికి డాక్టర్లకు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. పెన్షనర్స్ తమకము నాగేశ్వరరావు, ప్రసాదు, సత్యనారాయణ, పడాల వీరవెంకట సత్యనారాయణ, డేవిడ్ లివింగ్టన్, పాల్గొన్నారు.

నేతన్నలకు అండగా ప్రభుత్వం: యనమల రాజేష్

తునిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నేతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ అన్నారు. డి.పోలవరం గ్రామంలో చేనేతకారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు చేనేతకారులకు హ్యాండ్లూమ్ వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేతతోపాటుగా ఉచిత విద్యుత్‌ను అమలుచేసి నేతన్న జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సర్ల లోవరాజు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నేరవేర్చుకున్న ఘనతకూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌ల చిత్రపటాలకు చేనేతకారులతో కలిసి పాలాభి షేకం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోలాశెట్టి రామలింగేశ్వరరావు, చిటికెల శ్రీనివాసరావు, దండే రామకృష్ణ, సర్ల బోడయ్య, వాడబోయిన సాంబయ్య, కోటనందూరు మండల టీడీపీ అధ్యక్షుడు పోతల సూరిబాబు, జక్కాన రామునాయుడు, తమరాన సత్యనారాయణ. తమరాన రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రా నిధులపై విజిలెన్స్ తనిఖీలు

జగ్గంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజక వర్గంలో నాలుగు మండలాల్లో సోమవారం జగ్గంపేట,గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల అధికారుల వద్దకు విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఆడుదాం ఆంధ్రా నిధుల విషయంలో అవకతవకలు జరిగినట్లు దీని విచారణ నిమిత్తం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లెక్కలకు సంబంధించిన ఫైల్స్‌ను కాకినాడ నుంచి వచ్చిన సీఐఎస్ ఎల్‌తో పాటు సిబ్బంది తనిఖీచేసి వారి వెంట తీసుకెళ్లినట్లు జగ్గంపేట ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు

సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీగా ప్రసాద్ ఎంపిక

జగ్గంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే) సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీగా పులిప్రసాద్‌ను బెంగళూరు బుద్ధవిహార్‌లో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్. ఎం.వెంకటస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా మీటింగ్‌లో నూతన కమిటీని ఎంపిక చేశారు ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్ నుంచి పులి ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. పదవికి ఎంపిక చేసిన జాతీయ కమిటీ సభ్యులు జి.సి.వెంకటరమణప్ప, ఎన్‌డీ అజయ్ ప్రసన్న, తోట రవికుమార్ , జవాజి పనీంద్ర కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

తొండంగి తహసీల్దార్‌గా కాంతారావు



తొండంగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తొండంగి తహసీల్దార్‌గా నియమితులైన టి.కాంతారావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో తొండంగి తహశీల్దార్‌గా పనిచేసిన మురార్జీ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో తుని తహశీల్దార్ ప్రసాదరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు మండలాల పాలన ఆయనకు భారం కావడంతో పెద్దాపురం తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న కాంతారావును పూర్తి అదనపు బాధ్య తలతో తొండంగి తహశీల్దార్‌గా నియమించారు. డీటీ వీరేష్‌కుమార్, ఆర్ఐ రాజారావు. వీఆర్వోలు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

22న అన్నవరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ప్రత్తిపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామాలలో సోమవారం అన్నవరం సత్యదేవ ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు సోమవారం ప్రచారం నిర్వహించారు. అన్నవరం దేవస్థానంలో ఈనెల 22న జరిగే ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను మహిళాభక్తులు సద్వినియోగం చేసుకో వాలని రెండు గ్రామాల్లో నల్లమిల్లి కృష్ణబాబు మహిళలను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో ఈర్ల సుబ్బారావుల ఆధ్వర్యంలో జరిగే సామూహిక వరలక్ష్మి వ్రతాలకు భక్తులు అరటిపండ్లు, కొబ్బరికాయ, పువ్వులు తీసుకురావాలని నల్లమిల్లి కృష్ణబాబు కోరారు.

పేకాట శిబిరంపై దాడి

● కారు, బైక్‌తోపాటు ఐదుగురి అరెస్టు

● రూ.23500 నగదు స్వాధీనం

రౌతులపూడి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గిడజాం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పేకాట శిబిరంపై పోలీస్‌లు దాడి చేశారు. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి దాడిచేసి కారు, బైక్‌తోపాటు ఐదుగురిని అదుపులోకి తీసుకుని అరెస్టుచేసి ఇరవై మూడువేల ఐదువందలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట జరుగుతుందనే సమాచారం మేరకు, జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ జూదాలపై కఠినచర్యలు తీసు కోవాలనే ఆదేశాలమేరకు పేకాటపై దాడి చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిరంతరం పేకాట, జూదాలపై నిఘా ఉంచినట్టు తెలిపారు.

ఏలేశ్వరంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలి

● కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో ప్రభుత్వ భూములను, చెరువులను ఆక్రమించి భవనాలు కడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి కొనిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ ఏలేశ్వరం నగర పంచాయతీ 20వ వార్డులో సర్వే నెం.92/1లో ఉన్న ప్రభుత్వ భూమిని ఒక వ్యాపారి ఆక్రమించి భవనాలు కడుతుంటే కమిషనర్ మౌనంగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ కొండభూమి పది సెంట్లలో ఒక ప్రైవేటు వ్యక్తి భవనాలు నిర్మిస్తుంటే కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. ఈ వివాదం హైకోర్టులో ఉన్నప్పటికీ నిర్మాణాలు ఎలా చేస్తున్నారని అడిగారు. ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న నరసరాజు ప్రభుత్వ చెరువును ఆక్రమించిన టీడీపీ నాయకులు భవనాలు నిర్మిస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవట్లేదో కమిషనరు సమాధానం చెప్పాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ మహిళా సంఘం జిల్లా నాయకులు గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మి, రెడ్డి ఆనంద పాల్, నాగులపల్లి అర్జునుడు, సోమల కోసలవల్లి కొండల రావు, బొండు వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో ఐటీఐ కాలేజ్ నిర్మాణం చేపట్టాలి

జగ్గంపేట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ప్రభు త్వ ఐటీఐ కాలేజ్ నిర్మాణం చేపట్టాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. సోమవారం జగ్గంపేట సెంటర్ నుంచి స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ పస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంన్నర అవుతున్నా నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు.